శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

ఓ సద్గురుసాయి!
శ్వాసించే ప్రతిక్షణం నీ చరణ సేవకై అంకితమునీ!
హృదయంలో ఉదయించే ప్రతి భావంలో నీ తలపులే పండనీ!
నాలుక పలికే ప్రతి పలుకులో నీ చరణామృతం నిండనీ!
చెవులకు చేరే ప్రతిశబ్ధంలో నీ నామస్మరణే ధ్వనించనీ!
కరముల ప్రతి కదలిక నీకు చేసే నమస్కారమునీ!
పాదాల ప్రతి అడుగు నీ దివ్య సన్నిధికి చేసే ప్రదక్షిణ కానీ!
హృదయఫలకంపై నీ దివ్య చరణాలు ముద్రించుకుపోనీ!
అసలు నాలో నేనే లేక అంతా నీవై నిండనీ!
బాబా ఇది నా ప్రార్థన
- దీక్షిత్ డైరీ నుండి.

నా దగ్గరున్న వారు ఏమి చేసినా అది వారి ప్రేమకు వ్యక్తీకరణ కావాలి. అంతకుమించి వేరే ఏ కారణంగానూ ఉండకూడదు. అప్పుడు ఆ ప్రేమ స్వచ్ఛంగా వ్యక్తమవుతుంది. మన జీవితమంతా (సద్గురువుపట్ల మనకు గల) ప్రేమను వ్యక్తీకరించడంలో భాగం అయినపుడు ఇక ప్రతిదీ నిష్కామమే. ఇదే సాధనలో జీవితం భాగం అవ్వడం అంటే.

మనం ప్రేమను వ్యక్తీకరించేందుకు ఒక పనిని ఎంచుకునేటప్పుడు అది మన శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా ఉండాలి. అంతేగాని, మన ఇష్టాయిష్టాల ననుసరించి ఉండకూడదు. -శ్రీబాబూజీ





పండిత, పామర, పీడిత జనులందరికీ వారే కదా సాంత్వన.
ఆనందసంద్రమే కదా వారి చింతన.

# గురుకృప

నగురో రధికం - నగురో రధికం - నగురో రధికం

శతాబ్ది గురుపూర్ణిమ సంచిక

## ఆత్మగౌరవం (Self Respect)

**-: ఎదుటివాడిపట్ల వ్యతిరేకత లేకుండా ఉండేటువంటి ఫీలింగ్ Self Respect :-**

ఎదుటివాడు తక్కువ, వాడు వెధవ, వాడు అటువంటివాడు, ఇటువంటివాడు అనుకోకుండా ఉండేటువంటిది Self Respect. ఎదుటివాడి యొక్క తక్కువని ఆధారం చేసుకునేసరికి అహంకారం వస్తుంది. వాడేంటి నన్ననేది?

ఇప్పుడు పై ఆఫీసర్ ఎవరో ఉన్నాడు, నువ్వు లేటుగా పోయ్యావు. తిట్టాడు. బాధపడ్డావు. Self Respect కాదు అది. ఎదుటివాడి నుంచి ఆశించడం కాదు Self Respect అంటే. మనం వాడిని దేబిరించుకునేట్లు ఏమైతే చేస్తామో అప్పుడు Self Respect కోల్పోతాము. జాగ్రత్తగా ఆలోచిస్తే మీకే తేడా తెలుస్తుంది. Self Respect లో ఒక ఆనందం ఉంది. ఒక పీస్ ఉంది. ఒక హ్యాపీనెస్ ఉంది. అహంకారం వస్తే Disturbance వస్తుంది. రెండింటికీ basis different. ఒకదానికి ఒక Positivity Base. ఇంకోదానికి ఒక Negativity Base.

అట్లాకాకుండా తిరిగి మనం కూడా రాజకీయం చేసి, వాడిని ఎట్లాగో కాకా పట్టి, వాడి goodwill సంపాదించుకోవడానికి ప్రయత్నం చేసినప్పుడు, దిగజారినప్పుడు అది ఆత్మగౌరవం చంపుకోవడం అవుతుంది.

మనసు ఎట్లా ట్రిక్ చేస్తుంది అనంటే అది ఆత్మగౌరవం, ఇది ఆత్మగౌరవం లోపించడంలా కనిపిస్తుంది. డిగ్నిఫైడ్‌గా గమ్మున ఉండడం ఆత్మగౌరవం చంపుకోవడంలాగా, వాడి దగ్గరకొచ్చి కాకాలు పట్టుకొని వెనకాల తిరగటం ఆత్మగౌరవం పెంచుకోవడంలాగా కనిపిస్తుంది మనకు. నిజంగా ఒక్క క్షణం ఆలోచించండి. మీకే తెలుస్తుంది, నేను అదీ ముందు చెప్పింది. ఎదుటివాడి పట్ల వ్యతిరేకతను పెంచనటువంటిది, ఎదుటివాడి నుంచి ఆశించకుండా మనం ఇచ్చేటటువంటిది ఆత్మగౌరవం. మనం చేసేవి మన ఆత్మగౌరవానికి గీటురాయి. ఎదుటివాడు చేసేది కాదు. ఎదుటివాడు మనల్ని అవమానం చేస్తే అది మన ఆత్మగౌరవానికి కించ కాదు. దానికి మనం ఎట్లా రియాక్ట్ అవుతాము అనేటువంటిది మన ఆత్మగౌరవం మీద ఆధారపడి ఉంటుంది. మనం చేసేదే ఆత్మగౌరవం.



బాబా ఉన్నారు, ఈ రోజున మనకు జాబ్ ఇప్పించింది ఆయనే. కాకపోతే ఆయన ఇంకేమి చేస్తారో ఆయనకు తెలుసు. దీని గురించి ఇట్లా దిగజారి వాడి, వీడి కాళ్ళు పట్టుకొని, ఈ కాకాలు పట్టుకొని అబద్ధాలు చెప్పి ఈ రకంగా ఉండటం గౌరవమా? మనకు బాబా ఉన్నారు అని నిజాయితీగా, ధర్మంగా ఉండటం గౌరవమా? ఏది గౌరవం? ఇందులో ఎక్కువమందికి జరిగేటువంటిది అదే. ఈ రాజకీయాలలో పడతారు పొయ్యి. –శ్రీబాబూజీ

## సంతృప్తి (Contentment)

సంతృప్తి అనేది రెండు రకాలు. ఇప్పుడు నీవు చెప్పినట్టుగా ఉద్యోగము, జీతము, ఇల్లు వీటిలో సంతృప్తి ఒకటి. ఆ సంతృప్తి అనేది ఇక చాల్లే అని అనిపిస్తుంది ఉన్నంతవరకు. కాని ఆనందంగా ఉన్నామా? అంటే ఇక చాల్లే అనేటువంటిది కేవలం ఇల్లు, జాబ్‌కు సంబంధించినదేనా! ఇక వేరే దాంట్లో సంతృప్తి లేదా మనకు? నువ్వు కంటెంట్ అవ్వదల్చుకున్నటువంటి నీ కంటెంట్ అదేనా? "నీ కంటెంట్ ఏమిటో, ఆ కంటెంట్‌ని పూర్తిగా అనుభవించడం సంతృప్తి". అది కూడా కావాలి మనకు. కాని అది ఒక్కటే కాదుగా.

ఇవన్నీ ఉన్నప్పటికీ కూడాను ఏదో లేదే, ఏదో కొరత, ఏదో సాధించాలి, ఏదో అనుభవించాలి – అనే భావన మనలో ఉంటుంది. అదేంటో తెలియదు, తృప్తి ఉండదు, సంతోషం ఉండదు, విసుగు ఉంటుంది, ఏంటో అసంతృప్తి ఉంది. ఏదో, ఇంకేదో సాధించాలి అన్పిస్తుంటుంది. అది ఏమిటి?

అది నేను మొదట చెప్పను. ఎందుకంటే, ఇది ఎవరికి కావాలి? ముందు నువ్వు చెప్పిన సంతృప్తి అది వచ్చినవాడికి. వాడికి నిజంగా ఆధ్యాత్మిక జీవితం మొదలవుతుంది అక్కడి నుంచి.

సరైన ఉద్యోగం లేదు. సరైన ఇల్లు లేదు, ఆర్ధికంగా ఇబ్బందుల్లో ఉండి వాడికి ఏదో లేనటువంటి కొరత ఉన్నది. ఆ ఆనందాన్ని అనుభవించమని చెబితే ఉపయోగం లేదు. ఎందుకంటే వాడికి ప్రస్తుతానికి ఆనందం దాంట్లోనే ఉంది. నాకు ముందు జాబ్ ఇవ్వండి సార్, నాకు మంచి ఆనందం వస్తుంది అంటాడు. ఇవన్నీ వచ్చిన తర్వాత కూడా ఇంకేముంది సాధించాల్సింది. ఇంకేం పెద్దగా ఏమీ లేదు అనుకున్నప్పుడు ఆ real quest start అవుతుంది.

అన్నీ ఉండి కూడా నీకు bubbling ecstatic happiness ఉందా? అట్లా కూర్చుంటే లోపల నుంచి ఆనందం తన్నుకొస్తోందా? లేకపోతే మరి అది కొరతేగా? ఏం ఎందుకు రాకూడదు? హా! ఏదోలే సరిపోయిందిలే! జిల పుడితే గీరుకున్నట్టు బాగానే ఉంటుంది. జిల పుడితే గీరుకుంటే బాగుంటుంది కనుక జిల కావాలి మనకు. గోళ్ళు కావాలి. కాబట్టి ఇంకా పెంచుకుందామా, ఇంకా పెంచుకుందామా అని ఆ వ్యాపారం చేద్దామా? ఈ వ్యాపారం చేద్దామా అని కొత్త సమస్యలు సృష్టించుకొని ఏమయ్యా ఎట్లా ఉన్నావు? అని అంటే ఏం లేదు సార్. అంతా హ్యాపీగా ఉన్నాను. గ్రీన్‌కార్డు–అదొక్కటే సార్ నా బాధ. ఓకే గ్రీన్‌కార్డ్ అయిపోయింది. Citizenship Sir next.



ఏదో ఒక సమస్యను సృష్టించుకోవాలి మనం. జిల ఉండాలి, గోళ్ళు ఉండాలి, అది కాదు, **"ఏమి ఉన్నా, ఏమి లేకపోయినా అలా కూర్చుంటే లోపల నుండి తన్నుకొచ్చే ఆనందం - అది మన గమ్యం, అది మన లక్ష్యం"**. ఒక గ్లాసులో నీళ్ళో, పాలో పోస్తే ఆ కంటైనర్‌లో ఉండేటువంటి కంటెంట్ అట్లా పొర్లిపోతూ ఉంటుంది. That is real contentment.

అట్లా మనము ఆ రకమైన పాత్రలాగా తయారయ్యి, దానిలో ఆనందం అనేటువంటి ద్రవాన్ని పోసి, అది పైకి పెల్లుబికినపుడు ఆ ప్రక్కన చిందుతాయే, ఆ చిందేటువంటి అనుభవం లాంటిది – బాబా లాంటి కంటైనర్‌లో నుంచి మనకు దొరికేటువంటి ఆ బిందువులు. అది నిండిపోయి ఇంక పొర్లి ఉబ్బిందన్నమాట. అది ఆయన మహిమ. మనం అలా తయారు కావాలి. – శ్రీబాబూజీ



ఇంటికి మూలాధారమైన స్థంభం గురుదేవులు. అట్టి సద్గురువును సేవించుకోమని సాయిబాబా పలుకుల అంతరార్థం. గురువు పట్ల విశ్వాసం ఉంచితే నదినే కాదు విషయ వాసనల కెరటాలతో, కోరికల సుడిగుండాలతో నిండిన సంసార (భవ) సాగరాన్ని సైతం అవలీలగా దాటవచ్చు. **– సేకరణ : గురుకృప**

## అనన్య భక్తి సాధన

అనన్య భక్తి సాధనలో భక్తుడు భగవంతుని మీదే మనసు లగ్నం చేసి త్రికరణ శుద్ధిగా భగవన్నామ స్మరణ చేయాలంటారు ఉన్నత సాధకులు. ఈ విషయంగా కబీరుదాసు చెప్పిన హిందీ దోహా (పద్యం) ఎంతో ప్రసిద్ధి.

**మాలాతో కర్‌మే ఫిరే, జీబ్ ఫిరే ముఖ్ మాహీ!**
**మనువా తో చహు దిశా ఫిరై, యహి తో సుమిరన్ నాహీ!!**

“యాంత్రికంగా చేయి జపమాల తిప్పడం, నాలుక తనకేదో పని అప్ప చెప్పినారన్నట్టుగా భగవంతుని నామాన్ని ఉచ్ఛరిస్తుండడం, కళ్ళు కనిపిస్తున్న అన్నింటిని చూస్తూ, మనసేమో కనిపించే అన్నింటి గురించి ఆలోచించడం భగవన్నామ స్మరణ అనిపించుకోదు” అని దీని అర్థం.

మనసా, వాచా, కర్మణా చేసేదే నిజమైన భగవన్నామస్మరణ అని ఆయన అభిప్రాయం. ఆత్మానుభూతిని అనుభవిస్తూ, సంతృప్తికరమైన జీవితాన్ననుభవించడానికి మనోనియంత్రణను మించిందిలేదంటారు అనుభవజ్ఞులు. మనసుపెట్టి ప్రయత్నిస్తే దేన్నైనా సాధించే వీలుంటుందంటుంది మనో వైజ్ఞానిక శాస్త్రం. “మనోనియంత్రణ సాధించిన వ్యక్తి పర్వతాలను కూడా అణువణువుగా పగలగొట్టవచ్చు” అంటారు స్వామి వివేకానంద. **సద్గ్రంథపఠనం, సజ్జన సాంగత్యం, భగవన్నామ సంకీర్తన ఆధ్యాత్మిక సాధనకు బాగా ఉపకరిస్తాయంటారు ఆధ్యాత్మికోన్నతి సాధించినవారు.**

**– కబీరు**


---

సాయి సంప్రదాయంలో శ్రీసాయి (గురువు) వినా సద్గురువు లేడు, అవసరం లేదు, రాదు. **“కారు కారు గురువు ‘కా’ గుణింతము చెప్పు”** అన్న వేమన యోగీంద్రుని సూక్తిని స్మరించి జాగరూకులై మెలగాలి. బాబా దయవల్ల తమకు లభించిన కొద్దిపాటి విజ్ఞానాన్ని సాటి సాయిభక్తులతో పంచుకునే అవకాశం కలిగించిన ‘గురుకృప’కు వినమ్రులై తండ్రికి తగ్గ బిడ్డలుగా ఎదగాలి.

**పూజ, ఉపాసనలు ఆత్మబలాన్ని పెంచే ఆధ్యాత్మిక వ్యాయామాలు.**



సంపుటి : 21
సంచిక : 3




జూలై 27
2018



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ ‘సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!’
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

**– శ్రీబాబూజీ**

### లోపలి పేజీలలో


**పథగామి** – గురుకృప 4
**గురుకృపాలహరి** – గురుకృప 8
**పదముద్రల వెంట పరవశంతో...** – గురుకృప 12
**గురువు – శిష్యుడు** శరశ్చంద్రికలు 19
**నిన్ను ఉద్ధరించు కొనవలసినది నీవే!** – పార్థసారథి ప్రవచనాలు 23
**నదిని దాటించిన గురునామం** – గురుకృప 29




నిర్వహణ : ***గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు***

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



## పథగామి

### గురువు అంటే...

నీ నిజమైన లక్ష్యాన్ని నువ్వు సాధించడంలో సహాయపడేవారే యదార్థమైన గురువు. గురువు అన్న పదానికి అర్థం అజ్ఞానమన్న చీకటిని జ్ఞానమన్న జ్యోతి (వెలుగు)తో తొలగించడం. గురువు అన్నది ఒక తత్త్వం. ఒక సాంప్రదాయం. అందుకే బాబా "నేను 5 1/2 అడుగుల దేహం అనుకుంటే వారు నన్ను చూడనట్లే" అని, "మా సాంప్రదాయమే వేరు" అని అన్నారు. గురువు అన్నది రెండు అక్షరాల (పదం) మేళవింపు. 'గు' – చీకటి, 'రు' – జ్యోతి (వెలుగు). సూర్యుడిలాగా మనకు వెచ్చదనం ఇస్తూ, చంద్రుడు ఏ విధంగా మనకు చల్లదనం (ఆహ్లాదాన్ని) ఇస్తూ ఎంతో ఎత్తులో ఉండి పోతాడో అలాగే గురువు మనకు అవ్యాజప్రేమను అందిస్తూ, బంధాలు పెట్టుకోకుండా ఉంటారు. 'గు' గుణాతీతుడు, 'రు' – రూపాతీతుడు, 'వు' – తన ఉనికికి ఏ కారణం లేక, అన్ని ఉపాధులకు తానే కారణమై ఉన్నవాడు. ఇలా ఆ గురువు అన్న ప(థ)దానికి ఎన్నో అర్థాలు. అవ్యాజప్రేమే జ్ఞానోదయానికి ఆధారభూతం అన్నది నిరూపిస్తుంటారు, అనుగ్రహవంతుల్ని చేస్తారు, గురువుగా నిలుస్తారు. ఇదే సద్గురుపథం. అందుకే 'గురువు' అంటే గురుతు అన్నది శ్రీరమణులు. వారి ప్రేమకు నువ్వెవరు, నువ్వేం చేసావు అన్న దానితో సంబంధం లేదు. వారి ప్రేమ, దయ, కరుణ, ఎప్పుడూ... ఎల్లప్పుడూ మనతోనే ఉంటాయి, ఉన్నాయి. ఆయన ఉనికిని తెలుసుకోవలసిన సమయం వచ్చినప్పుడు ఆయనే గోచరిస్తారు, వస్తారు, తెలియపరుస్తారు. "నా భక్తుడిని నేనే ఎన్నుకుంటాను" అని అందుకే అన్నారు శ్రీసాయి. హెచ్చు తగ్గులు లేనివారు. తారతమ్యాలు చూపనివారు. సృష్టిలో ఏ ఒక్కరి(టి)నీ ఎక్కువగాను, తక్కువగాను పరిగణించనివారు. పండితుడనిగానీ, పామరుడనిగాని బేధభావం లేనివారు. విదేశీయుడు, స్వదేశీయుడు, హిందూ మతస్థుడు, ఇస్లాం మతస్తుడు, క్రిస్టియన్ మతస్తుడు... అనే బేధాలు లేక **'మానవత్వమే మతం'**గా భావించేవారు. వారు కులబేధం, లింగబేధం కూడా చూడని వారు. ఒక్కమాటలో చెప్పాలంటే సృష్టిలోని ఏ జీవికి ఏ బాధకలిగినా ఓర్వలేనివారు... ఇక వారు కనిపెట్టుకునే విధానం, మనలో పరివర్తన కోసం పడే తపన ఎలా వుంటాయో చూద్దాం. "మీకు మీ 'మార్పు' అవసరం లేకపోయినా నాకు అవసరం" అంటారు శ్రీబాబూజీ. అదే వారి ఆశ, ఆశయం, ఆకాంక్ష. **"మనిషి దైవంగా ఎదగడం బాబా మతం".** దైవంగా ఎదిగేంత మార్పు ఆశిస్తున్నారు గురుదేవులు.





## నదిని దాటించిన గురునామం

శ్రీతాజుద్దీన్ బాబా వాకీలో ఉన్నప్పుడు ఒకసారి అడవుల్లో తిరుగుతూ కన్హన్ నదివైపు వెళ్ళారు. ఎప్పటివలే భక్తులగుంపు బాబాను అనుసరించింది. అందరూ నది దగ్గరకు చేరారు. వర్షాకాలం కావడం వల్ల అంతకుముందు కురిసిన వర్షానికి కన్హన్ నదిలో నీరు వెల్లువలా ప్రవహిస్తుంది. నీటి వేగానికి కాలు పెట్టాలన్నా కూడా ప్రమాదంగా ఉంది. బాబా ఒక్కక్షణం నీటివంక తేరిపార జూచి 'యా అల్లాహ్' అంటూ నదిలోకి దిగి అల్లా నామస్మరణతో ఒక్కొక్క అడుగు వేస్తూ ముందుకు సాగారు.

ఆశ్చర్యం! నీరు బాబాగారి పాదాల వరకే వస్తున్నాయి. భయంతో ఒడ్డునే ఉన్న భక్తులు అందరూ ఇక ధైర్యంతో నదిలోకి దిగి 'అల్లా... అల్లా' అంటూ పెద్దగా ఉచ్ఛరిస్తూ ముందుకు అడుగులు వేశారు. కానీ రెండో అడుగుకే నీరు మెడలోతు వచ్చి వారిని తనతో లాక్కుపోవడానికి ఉగ్రరూత లూగసాగింది. అందరూ వెర్రిగా బాబాకేసి చూశారు. వారి దుస్థితి గ్రహించిన బాబా వెనుదిరిగి చూచి **"అల్లాహ్ అల్లాహ్ అని కాదురా అనాల్సింది... 'బాబా బాబా' అనండి. అల్లాహ్‌ను నేను చూశాను. మీరు కాదు"** అని చెప్పారు. భక్తులందరూ తాజుద్దీన్‌బాబాను హృదయాలలో నిలుపుకొని 'బాబా... బాబా' అంటూ నామజపంతో ముందుకు అడుగులు వేశారు. వెంటనే నీటిమట్టం వారి పాదాల వరకు తగ్గిపోయింది. బాబాగారేమో 'అల్లా' నామజపంతో, భక్తులేమో 'తాజుద్దీన్‌బాబా' నామజపంతో పోటెత్తి ప్రవహిస్తున్న కన్హన్ నదిని సునాయాసంగా దాటగలిగారు.

ఈ లీల వెనుక బాబాగారి దివ్యబోధ అర్థమవుతున్నది. ఆత్మ సాక్షాత్కారం పొంది ఎప్పుడూ పరమాత్మ శక్తితో లయమవుతుండేవారే భగవంతుడి ప్రతినిధిగా వ్యవహరింపబడతారు. అట్టివారే పరమాత్మశక్తిని తమ ద్వారా ప్రకటితం చేయగలరు. తమ ద్వారా పరమాత్మ దర్శనం చేయించగలరు. **మనకు నేరుగా భగవత్ కృప లభించదు కాబట్టే గురువు మీద నిజమైన విశ్వాసం ఉంచితే గురువు అనుగ్రహం లభించి, గురువు ద్వారా భగవంతుడి కృప మనకు అందుతుంది.** అందుకే సృష్టిలోన జీవరాశికంతటికీ మూలాధార పురుషుడు ఒక్క సద్గురువు మాత్రమే! ఇదే విషయాన్ని శ్రీసాయినాథులవారు కూడా స్పష్టపరిచారు. తనను దర్శించుకునేందుకు పండరి నుండి వచ్చిన కృష్ణాజీనూల్కర్‌ను ధుని వద్ద ఉన్న స్థంభాన్ని పూజించుకోమని శ్యామా చేత చెప్పిస్తారు. విశ్వమనే



మనస్సు బుద్ధివైపుకు ఉద్ధరింపబడుతుంది. బుద్ధి ఆత్మస్థితికి చేరుకొంటుంది. అతడు తనను తాను ఉద్ధరించుకొన్నవాడు అవుతున్నాడు. అతడి జీవితం ధన్యమవుతుంది. **అలాంటి ప్రయత్నం వందల వేల మందిలో ప్రారంభ మయ్యేటట్లుగా, అనగా వారు ప్రారంభించేటట్లుగా ప్రేరణను కలిగించడానికే మహనీయులు, ప్రవక్తలు దిగివస్తూ ఉంటారు. వారిచ్చేది ప్రేరణ, మనలో జరుగువలసినది ప్రయత్నం.** వారిచ్చేది **'ఉపదేశం'**. మనలో కలుగవలసినది మనను మనం ఉద్ధరించుకోవాలనే ప్రయత్నానికి కావలసిన **'ఉన్ముఖత్వం'.** వారిచ్చేది **'సందేశం'**. అది మనం చేస్తున్న ప్రయత్నం సరిగా జరగుతున్నదో లేదో చూచుకోవడానికి పనికివచ్చే **'అరచేతి దీపం'**.

ఇంతకూ తనను తాను ఉద్ధరించుకోవాలి! ఇది మానవుడు తెలిసికొనవలసిన సత్యం. ఆ ప్రయత్నం అతనిలో జరుగుతున్నప్పుడు అతనిలోని మనస్సు ఇంద్రియాలు అతనికి మిత్రులు. అంటే అవి కూడా నిజానికి తనకు తానే మిత్రుడవుతున్నాడు అప్పుడు. అలాంటి ప్రయత్నం ఎడల ఏమరుపాటు చెందినప్పుడు అలాంటిదేమీ అతనిలో జరుగనప్పుడు అతనిలోని మనస్సు, ఇంద్రియాలు నిజానికి అతనే అయినా, అతని పట్ల శత్రువులా పనిచేస్తాయి. అతన్ని దిగజారుస్తాయి. వ్యసనపరుణ్ణి చేస్తాయి, భ్రష్టుణ్ణి చేస్తాయి. నికృష్ట స్థితిలో నిలబెడతాయి. అప్పుడేమవుతున్నది. మనస్సూ, ఇంద్రియాలు నిజానికి తానే అయినా తనకు తాను శత్రువవుతున్నాడు ఇక్కడ. తనను తానే ధ్వంసం చేసికొంటున్నాడిక్కడ. తానే తనకు శత్రువవడం ఎంత చిత్రం.

కనుక మనిషీ! పాండవ మధ్యమునిలా నిలబడు! పార్థసారథి సారథ్యాన్ని అందుకో! ఇక రథాన్ని ముందుకు కదలనీ! **సారథి మనోరథాన్ని మాత్రం గమనించుకొంటూ ఉండు! నీకు జయం.** వారి ప్రేరణ-ప్రయత్నంగా మారితే, వారి ఉపదేశం ఉన్ముఖత్వాన్ని ఇచ్చి, వారి సందేశం తనను తాను పరిశీలించుకోవడానికి, గమనించుకోవడానికి, సరిదిద్దుకుంటూ పరీక్షించుకోవడానికి, ఉపకరించే అరచేతి దీపంలా ఉపయోగపడుతుంది.

**– పార్థసారథి ప్రవచనాలు**

---

**తపనమాది - దీవెన మీది**

**ఓ సద్గురుదేవా! మీ అనుగ్రహమునకు దూరంగా ఈ ప్రపంచంలో సుఖమన్నది ఎక్కడా లభించదన్నది నిజం. మీరు పలికిన మాటలనే బాటలుగా మలచుకుంటాం. మీ మాటల వెనుక అంతరార్థాన్ని ఆలకించే ప్రయత్నం చేస్తాం. ఆలకిస్తూ-ఆచరిస్తాం, ఆచరిస్తూ-తరిస్తాం.**





ప్రతి ఆదివారం మందిరంలో జరిగే సత్సంగానికి వచ్చే ఒకతను రెండు నెలలుగా రాకపోవడం. ఒకరోజు ఆ మందిరంలో సత్సంగం నిర్వహించే ఆచార్యుడు అతని ఇంటికి వెళతాడు. అది చలికాలం. ఆ సమయంలో ఆ వ్యక్తి చలి కాచుకుంటున్నాడు. వెళ్ళిన ఆచార్యుడు అతనికెదురుగా కూర్చోన్నాడు. మౌనం రాజ్యం ఏలుతున్నది. రాకపోవడానికి కారణం ఆయన అడగలేదు, అతను చెప్పడం లేదు. అప్పుడు ఆయన ఆ పొయ్యిలో నుండి కాలుతున్న కట్టెముక్కను తీసి ఓ ప్లేట్‌లో పెడతాడు. కొంతసేపటికి దానిలో అగ్ని (వేడి) తగ్గుతూ బొగ్గుగా మారుతుంది. మరలా దాన్ని తీసి పొయ్యిలో వేస్తారు. అది మరలా మండుతుంది. వెలుగు ద్యోతకమవుతుంది. ఇలా చేసి ఆయన వెళ్లిపోతాడు. మరుసటి ఆదివారం నుండి ఆ వ్యక్తి మందిరంలో జరిగే సత్సంగానికి క్రమం తప్పకుండా వెలుతుంటాడు. Constant touch.... అలా సాన్నిధ్యపు సాంగత్య ఆవశ్యకతను బోధించారు. ఒకసారి చేయి పట్టుకున్నాక... "చివరికంటా గమ్యం చేర్చేవరకు విడిచిపెట్టను" అన్నారు శ్రీసాయి. "శ్రీసాయిని కేంద్రంగా చేసుకొని శ్రీసాయి చుట్టూ అల్లుకున్న జీవన విధానం సాయిపథం" అంటారు శ్రీబాబూజీ. అలా ఆ సాన్నిధ్యాన్ని అంటిపెట్టుకోవాలంటే 'సత్సంగంతో' సాంగత్యం ఉండాలి కదా!

జీవితంలో జరిగే ప్రతీ సంఘటనా సద్గురు లీలాప్రబోధంగా గ్రహించి అనుగుణంగా వర్తించే దృక్పథం అలవర్చుకోవాలి. మన దృష్టిలో, దృక్పథంలో ఈ మార్పు – వారు ఆశిస్తున్నది. జీవనంలో అన్వయ సమన్వయాలతో ఆచరిస్తుంటే, సంయమనం కలిగి, చరితార్థత అందుతుంది. వారి దగ్గరకు, చెంతకు చేర్చుకునే ప్రణాళిక అవగతం చేసుకుంటూ... ఆ అనుభవాన్ని అంటిపెట్టుకోవడమే గురువుని అంటిపెట్టుకోవడంగా అనుభూతికొస్తుంది.

**దృష్టి :** పంచేంద్రియాలలో నయనాలకు (కళ్లకు) ఎంతో ప్రాధాన్యముంది. అది ఈ జగత్తులోని సుందర, సంభ్రమ, భయానక దృశ్యాలెన్నో చూస్తుంది. మనిషి అనుభూతులకు అవే హేతువులు. చూసే దృశ్యం ఒక్కటే అయినా – అది రేకెత్తించే భావనలు అందరిలో ఒకే విధంగా ఉండవు. వాటిలో స్థాయీ బేధం ఉంటుంది. దృశ్యాల్ని చూసే దృష్టి (దృక్పథం)ని బట్టి అది మారుతుంటుంది. ఆ చూపే అతడి ఆలోచన, బుద్ధి, తార్కికతకు అద్దం పడుతుంది. అదే అతడి వివేచనను, సంస్కారాన్ని తెలియచేస్తుంది.

ఏకలవ్యుడు తాను గురువుగా భావించే ద్రోణాచార్యుని మట్టిబొమ్మను ఎదురుగా పెట్టుకొని



విలువిద్యనభ్యసించాడు. అతడిది ఏకలక్ష్యం, ఏకాగ్రచిత్తం. ఆ శిష్యుడి దృష్టిలో అది బొమ్మకాదు – సజీవ రూపం. ఇతరులకు అది బొమ్మకావచ్చు, కానీ ఏకలవ్యునికి కాదు. అటువంటి దృష్టిని అలవర్చుకున్న వారికి, "నాకు నా చిత్రానికి భేదం లేదు. నేనే అంతటా అన్నిటా ఉన్నాను" అన్న శ్రీసాయి మాటల ఎరుక జీవితంలో జరిగే సంఘటనలలో, కనిపించే దృశ్యాలలో, ఎదురయ్యే సన్నివేశాలలో జీవిత సత్యాల్ని, పాఠాల్ని, గుణపాఠాల్ని గ్రహించే స్థాయి చిక్కుతుంది. అప్పుడే వారికి ప్రీతిపాత్రులం కాగలం. ఆలోచన విస్తృతమవుతుంది. మానసిక వికాసం కలుగుతుంది. ఆలోచనా పటిమను పెంచుతుంది. Highly thinking అంటే ఇదేనేమో.

**దృక్పథం :** ఇద్దరు శిష్యులు బుద్ధ భగవానుని వద్ద విద్యాభ్యాసం ముగించుకొని తిరిగి స్వగ్రామాలకు బయలుదేరతారు. మార్గమధ్యంలో ఓ నదిలో కొట్టుకుపోతున్న స్త్రీ ఆర్తనాదాన్ని వింటారు. ఒక శిష్యుడు ఆమెను ఒడ్డుకి చేరుస్తాడు. ఆ వనిత కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోతుంది. "పరస్త్రీ"ని తాకవద్దన్నారు కదా గురువుగారు మరిచావా? అని మిత్రుడు అడిగాడు. ప్రమాదంలో ఉన్న సాటి ప్రాణిని రక్షించాను అన్న సమాధానం అతనిది. ఇద్దరికీ దృశ్యం ఒక్కటే, దృక్పథమే వేరు. చూసే చూపులోనే భేదం. సత్యాన్ని, వాస్తవాన్ని (లింగ భేధం లేక సాటి జీవిగా) అర్థం చేసుకొని వ్యవహరిస్తే పరిణతి కలుగుతుంది. ఆ ఇద్దరిలోని అంతరమే అది. ఆ దృక్పథమే వారిని శిష్యుని చేసేది.

మన జీవితంలో ఎదురయ్యే సందర్భాలు, సంఘటనలు, సన్నివేశాలు అనేకం. వాటి నుంచి మనం నేర్చుకోవల్సిన అంశాలు ఎన్నో వుంటాయి. నేర్చుకోవాలనే దృక్పథం వున్నప్పుడు వాటిని గమనించి, ఒడుపు కనబరిచేంత దృష్టి అతనికి అలవడుతుంది. 'చెట్టు నుండి పండు భూమిపై రాలడం' చూసిన న్యూటన్‌ను ఆకర్షించింది. కుతూహలంతో ప్రశ్న పుట్టింది. అదే ఆయన్ను గురుత్వాకర్షణ (భూమ్యాకర్షణ) సిద్ధాంతాన్ని కనుగొనేలా చేసింది. దీన్నే "అన్వేషణా దృష్టి" అంటారు. ఈ దృశ్యాన్ని న్యూటన్‌కు ముందు కొన్ని తరాల వారు చూసారు. కాని వారందరికీ అది కేవలం ఓ దృశ్యం. ఓ సంఘటన, సర్వసాధారణమైన ఓ విషయం. దృష్టి మనిషి దృక్పథాన్ని తెలియచేస్తుంది. ఇక మార్పు తెచ్చుకునే ప్రయత్నం మనవైపునుండి సాగాలి. ఓ గ్లాసులో సగం నీరు వున్నాయి. దాన్ని చూసే దృష్టి మన నైజాన్ని స్వభావాన్ని, దృక్పథాన్ని తెలియచేస్తుంది. సగం నీళ్ళున్నాయి అంటారు. సగం గ్లాసు ఖాళీ అంటారు. సగం నీళ్ళున్నాయి అన్నవాడు ఆశావాది, తృప్తిగలవాడు.





మైత్రిని నెరపగలిగిన సామర్థ్యాన్ని పొందగలుగుతున్నాడు. అవి అతడి స్నేహితులయి అతని శ్రేయస్సునుకోరుతూ, అతనిని ఆత్మస్థితిలో అతడు నిలద్రొక్కుకునేలా చేస్తున్నాయి. అంటే ఏమిటి? అతనితో ఉన్నవారందరూ అతనికి కలిసివస్తున్నారన్నమాట.

అలాకాక ఏదో గాలికి కొట్టుకుపోతున్నామన్నట్లు బ్రతుకును గడిపేస్తున్నామనుకోండి. ఇంద్రియాలు చెదురుబాటు చెంది ఉంటాయి. మనస్సు వికలమై ఉంటుంది. బుద్ధికీ, వీటికీ లంగరుండదు. ఎవరిదారి వారిదిగా ఉంటుంది. ఎవరికి వారు మరొకరికి అడ్డుపడుతూ ఉంటారు. అసలు వ్యక్తికి కలసిరారు. తుఫానులోని దిక్కుతోచని నావలా అతని జీవితం దుర్భరమవుతుంది. అతని ఇంద్రియాలు, మనస్సు అతనికి శత్రువులయి ప్రవర్తిస్తాయి. అతను వాటికి సమాధానం చెప్పలేని స్థితిలో పడిపోతాడు. తనకు తానే శత్రువునన్న సత్యాన్ని వీక్షిస్తూ కూడా ఏమీ చేయలేని స్థితిలో పడిపోతాడు. అలాంటి స్థితిలో కూడా తనను తాను ఉద్ధరించు కోదలచుకొంటే, మళ్ళీ అతనికి దారి దొరుకుతుంది. కావలసిన దోహదమందుతుంది. అంతవరకూ శత్రువులుగా పనిచేసిన ఇంద్రియాలు, మనస్సు దారికి వస్తాయి. అయితే అన్నిటికీ కావలసినది ఒక్కటే తనను తాను ఉద్ధరించుకోవడానికి నిర్ణయించుకోవాలి. అతనిలో ఆ ప్రయత్నం జరగాలి. అతనిలో ఆ ప్రయత్నం రానప్పుడు ఎదుటివారు ఎంతటివారయినా ఏమీ లాభంలేదు. చూస్తూ ఉండవలసిందే. దీనికి అతడు ఇతరులను నిందించి లాభంలేదు. తనకు శత్రువు తానేనని గుర్తించాలి. ఉద్ధరించుకోవడానికి తనలో ప్రయత్నం ప్రారంభంకాకపోతే ఎవరెవరు ఎన్నెన్నిచేసినా, అవన్నీ బూడిదలో పోసిన పన్నీరేనని అతడు గ్రహించాలి.

అసలు ఇంతకూ ఉద్ధరించుకోవడమంటే ఏమిటి? మామూలు మాటలో చెప్పుకొందాం. నేను బాగుండాలి! మంచిగా బ్రతకాలి! మనిషిగా బ్రతకాలి! పెద్దలమాట వినాలి, పిన్నలయెడల బాధ్యతపడాలి! ఎవరినీ నొప్పించకుండా జీవించాలి! బాధ్యతలన్నింటినీ సక్రమంగా నిర్వర్తించాలి! తాను ఒకరికి బరువు కాకూడదు. పదిమందికి తాను సాయపడాలి! – ఇలాంటి భావాలతో, పెద్దల అడుగుజాడలలో పవిత్ర గ్రంథపఠనాల మధ్య నుండి తాను సాగుతున్నప్పుడు అతనిలో తనను తాను ఉద్ధరించుకొనే ప్రయత్నం అతనికి తెలియకుండానే ప్రారంభమయిందన్నమాట! ఇతడు ప్రవర్తనను తీర్చిదిద్దుకొంటున్నకొద్దీ అతనిలోని ఇంద్రియాలు మనస్సువైపుకు ఉద్ధరింపబడతాయి.



సృష్టి. నవమాసాలు మోసి, నొప్పులు పడి, బిడ్డను కని, అతడిని చంకన వేసుకొన్న తల్లికి ఉన్న తృప్తి, తెలిసినవారి బిడ్డను దత్తత తీసికొన్నవారికి లభించగలదా? ఆ తృప్తి ఏమిటో వారికి ఎప్పటికయినా తెలుస్తుందా? కనుక **నొప్పులు తప్పవని తెలిసినా స్త్రీకి స్వయంగా బిడ్డను కనాలని ఉంటుంది. కొన్ని కష్టమని తెలిసినా పొందాలన్న కాంక్ష మానవునిది. సాధన కూడా అలాంటిదే.** ఆత్మస్థితిని తానుగా సాధించుకొన్నవేళ లభించే అనుభూతి అలాంటిది. ఆ మధురానుభూతిని అనుభవించడానికే అటు స్త్రీకి, ఇటు సాధకునకు భగవంతుడు ఇలాంటి అవకాశమిచ్చాడు, ఇది మాత్రం గ్రహించాలి!

కురుక్షేత్రాన శ్రీకృష్ణుని సారథ్యరూపంలో ఉపదేశింపబడిన సూక్ష్మం కూడా ఇదే! అతడేమన్నాడు. నేను రథం నడిపిపెడతాను. సారథ్యాన్ని వహిస్తాను. సలహాలనిస్తుంటాను. కాని ఆయుధాన్ని మాత్రం పట్టను, యుద్ధం చేయను. ఆయుధాన్ని పట్టవలసినవాడివి నీవు. యుద్ధం చేయవలసినవాడివి నీవు. విజయం సాధించవలసిన వాడివి నీవు. అలా జరిగిననాడు అది నీకూ ముచ్చట నాకూ ముచ్చట. నేను తలుచుకొంటే వీరందరినీ క్షణకాలంలో సంహరించగలను కాని అలా తలచుకోను. ‘ఆ పని నీ చేతులమీదుగా జరగాలి’, నీవే చేయాలి, ఇది నా నిర్ణయం అంటాడు శ్రీకృష్ణుడు. ఈ సన్నివేశం సరిగా మానవుడు తనను తానే ఉద్ధరించుకోవాలి అన్న ఉపదేశానికి చక్కగా సరిపోతుంది. అతడేమంటున్నాడు, ‘దోహదమంతా నాది–సాధన మాత్రం నీది’ అని నొక్కి చెబుతున్నాడు. ఈ సన్నివేశాన్ని మరల మరల స్మరించుకోవడం–ఆత్మస్థితిని మనమందుకోవడానికి ఎంతయినా అవసరం. **ఆయుధం ముట్టను. సారథ్యం వహిస్తాను. ఎంత చిత్రమయిన వాక్యమిది.** ఎంత సూక్ష్మమయిన ఉపదేశమిది, ఈ ఒక్క వాక్యంతో నరజాతికి నారాయణుడు **‘నా నిర్దేశమిది సుమా!’** అని తెలియబరుస్తున్నాడు కదా!

కనుక అర్జునుడికి చెబితే ఇక అందరికీ చెప్పినట్లే! ‘సారథ్యం నాది, కర్తవ్య నిర్వహణం మీది’ దానితో మిమ్మల్ని మీరు ఉద్ధరించుకొన్న వాళ్ళవుతారు. అని పార్థసారథి తెలియజెబుతున్నాడు. అలాంటి సారథ్యంలో కర్తవ్యమన్నది సాధనగా సాగుతున్నప్పుడు ఇంద్రియాలు, మనస్సు వశంలోనికి వస్తాయి. మనస్సు బుద్ధివైపుకు మళ్ళుతుంది. బుద్ధి అన్నిటినీ కలుపుకొని ఆత్మను చేరుకొంటుంది. ఆత్మ ఇన్నిటినీ తనలో నిలుపుకొంటుంది. ఆత్మవంతుడు అనే స్థితిని అతనికి అనుగ్రహిస్తుంది. ఇలాంటి ప్రయత్నం చేస్తున్నవాడు తనకుతాను మిత్రుడవుతున్నాడు. తన ఇంద్రియాలతో, మనస్సుతో





సగం గ్లాసు ఖాళీ అన్న వారిది నిరాశావాదం. వెలితి గురించి ఆలోచన వారిది. పరిశీలనాత్మక దృష్టి కలవారు వర్తమానంలో వున్నవారు. సగంగ్లాసు నీటితో, సగంగ్లాసు గాలితో నిండివుంది అని గ్రహిస్తారు. ఇతడు వాస్తవాన్ని దర్శిస్తున్నాడు. ప్రతిదీ పూర్ణం నుండి వచ్చినదే. పూర్ణమే అన్నది. ఏదీ పనికి రానిదికాదు ఉపయోగించుకునే కౌశలం, దృష్టి నీకు లేవు అన్నదే మనం గ్రహించుకోవాలి. నిశితంగా చూడగలగడం అలవడాలి. పరిశీలనాత్మక దృష్టి అలవడాలి. (Nothing is trivial - Sri Babuji)

ఇక బాబా చరిత్రలోకి వద్దాం. బాబా సూక్తులను ఎలా అర్థం చేసుకుంటున్నాం? "Don’t postpone any thing" అన్నారు శ్రీసాయి. మన దృష్టిలో ఏ పనులను పోస్ట్‌పోన్ చేయకూడదు అని అర్థం చేసుకుంటాం. ఇది ఒక స్థాయి దృష్టి. ఈ స్థాయి పెరుగుతుంటే... ఇంకా ఎన్నో అర్థాలు స్ఫురిస్తాయి. ఉదా: బాబా లీల ఒకటి చూద్దాం. డా॥ పిళ్ళే వృత్తాంతం. తనుకున్న రుగ్మతను భరించలేక దాన్ని ఇప్పుడు తొలగించి... పది జన్మలకు పొడిగించమంటున్నాడు. దీంట్లో Postponementనే అడుగుతుంది అతను. దానికి బాబా “ఎందుకురా పదిరోజుల్లో పోయేదానికి పదిజన్మలు” అని అన్నారు. ఓర్పు లేకుంటే (ఓర్చుకునే శక్తి లేక) అనుకుంటాం కాని, ‘తనున్నది’ సద్గురువు వద్దనే అన్నది మరుస్తున్నాడు. “ఆయనే ఉండగా–నాకు ఇంకా ఏం కావాలి అన్న దృక్పథం” అలవడాలి. మన దృష్టిలో సద్గురువు ఉండటం (5 1/2 అడుగుల రూపం) నుంచి ఆయనన్న తత్త్వాన్ని మనదృష్టిలో నిలుపుకునే వరకు ప్రయత్నం సాగిద్దాం.

లీలల ద్వారా బాబా అంటే–సద్గురువు అంటే సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వ సమర్థుడు అని మనం గ్రహించాం. కాని వారేమో... “నేను ఆనంద స్వరూపాన్ని, అందరిలో చైతన్యంగా ఉన్నాను” అంటారు. “ప్రేమతో దేన్నైనా మార్చుకోవచ్చు. ప్రేమతో ఉందాం” అంటూ ప్రేమ స్వరూపాన్ని అంటున్నారు శ్రీబాబూజీ. అది వారి తత్త్వం. ‘బాబా’ అంటే ‘ఆనందం’, ‘బాబా’ అంటే ‘చైతన్యం’ అన్న ఎరుకలో మనం ఆనందంగా వుంటూ అంతటా ఉన్న చైతన్యాన్ని బాబాగా దర్శించే దృక్పథం అలవర్చుకొనేందుకు అభ్యాసం మొదలెడదాం. **ఆనందంతో నీ అనుబంధమే బాబాతో అనుబంధాన్ని పెంచుతుంది అన్న సత్యం తెలియాలి.**

గురువుగారు మనపై చూపే ప్రేమను ఆస్వాదిస్తూ, అనుభవిస్తూ – ఆ అనుభవాన్ని, “ప్రేమను



పంచుకుంటే పెరుగుతుంది" అన్న శ్రీబాబూజీ మాటలే బాటలుగా, పదాలే పథంగా మలచుకొని, ఆ బాటన ఒక్క అడుగే ఆయనవారిగా ఎదిగే ప్రయత్నారంభమై, అదే ధ్యేయంగా, మార్గంగా, గమ్యంగా అనుసరిద్దాం... ఆ విధంగా గురుదేవుల వద్ద ... సంకల్పం చేసుకుందాం ఈ గురుపూర్ణిమన. అప్పుడే ఇది గురుపూర్ణిమ – నిజమైన ఉత్సవం – నిజమైన మహోత్సవం.

**– గురుకృప**

# గురుకృపాలహరి

**"నీ కథామృతము నిరతసేవన నాకు, చేకొనుట సకల సుఖ సేవనంబటుగాన"**

అంటాడు పదకవితాపితామహుడు అన్నమయ్య. నిరతము నీ గుణగానామృతాన్ని సేవిస్తున్నానని, అన్ని సుఖాలూ నాకు నీ మహాత్మ్య మధుర శ్రవణంలోనేనని చెప్తాడు తన అక్షర సుమాలమాలతో. అన్నమాచార్యస్వామి చేసింది అక్షరార్చన. భాగవతుడు చేసేది భగవంతుని ఉనికిని జనులందరికీ తెలుపడమే. ఆ 'ఉనికి' మన 'మదికి' తెలియాలంటే మాత్రం జరగాల్సింది 'స్మరణ', మన నిత్యజీవిత కార్యాలలోని వ్యవహారాలన్నింటిలోను అంతర్లీనంగా ఉండాల్సింది మనం విశ్వసించిన 'సద్గురు' స్ఫురణ. ఆ స్ఫురణ మనలో సదా నిలిచేందుకే సత్యద్రష్టలైన సద్గురుచంద్రుల చరితల మననం, లీలాగానం. ఇది కేవలం 'గురుకృపా' విశేషం మాత్రమే. 'గురుకృపా' 'లహరి' – 'గురుకృప' అనే 'పెద్ద అల'–నిజానికి మనందరి జీవితాలను సమూలంగా మార్చివేస్తోంది. సద్గురువు అనే మహా 'తరంగం' చేసిన మేలు, శ్రేయస్సు ఏమంటే మానవుని అం'తరంగాన్ని' మార్చివేసింది. లేకపోతే మనలా, మనతో తిరుగాడుతున్న ఒక 'వ్యక్తి'కి మనం ఎందుకు మోకరిల్లుతున్నాము? ఎందుకు అతని చూపు మనలో(పల) చలనం కలిగిస్తోంది? ఆ రూపం దర్శించడంతోనే ఎందుకు ఎన్నో శేష ప్రశ్నలు విశేషంగా సమాధానపడుతున్నాయి? ఆ చూపులు, కేవలం ఆ చూపులే మనం చేసే కల్మషాలను, కప్పిపుచ్చుకునే తప్పులను మాటా, పలుకూ లేకుండా ఎలా ప్రశ్నించగలుగుతున్నాయి? వారి పేరు మనలో ఒక ఆత్మ విశ్వాసాన్ని ఎలా నింపగలుగుతోంది? ఎందుకు వారి గురించి ఆమూలాగ్రం తెలుసుకోవాలని మనసు ఆరాటపడుతోంది? ఇన్ని వేల మంది – వారితో ఎవరికి వారిదే అయిన ఒక గొప్ప అనుబంధంతో ఎలా పెనవేసుకుపోతున్నారు? ఎందుకు ఆ మనిషి ప్రతీచర్యా, ప్రతీమాటా,





ఇలా చూస్తూ సాగుతున్నప్పుడు మనకేమి తెలుస్తున్నది? కావలసిన దోహదాన్ని అందుకొంటూ, మనకు మనంగా లక్ష్యాన్ని సాధించుకోవడంలోనే తృప్తి అన్నది దాగి ఉన్నది అని స్పష్టమవుతున్నది. సరిగా ఇలాంటి స్థితే యోగసాధనలోకూడా మనకు దర్శనమిస్తుంది.

తోటమాలి తోటలోని మొక్కలకు ఏం చేస్తున్నాడు? చక్కటి దోహదాన్ని అందిస్తున్నాడు. ప్రతి మొక్కనూ, చెట్టునూ కనిపెట్టుకొని ఉంటున్నాడు. వాటికి కావలసిన పోషణనందిస్తున్నాడు. రక్షణ నందిస్తున్నాడు. అన్నీ చేస్తున్నాడు. కాని ఎదిగి పూలు పూసి, కాయలుకాసి, పండ్లనివ్వవలసిన బాధ్యత మాత్రం ఆ మొక్కలూ, చెట్లదే! ఈ ఈయబడిన దోహదంతో అవి విజృంభించి, సమాజాన్ని నవరసాలతో ఆలరిస్తున్నాయి. అందుకు ఆ తోటమాలి, "ఆహా! నా దోహదం ఫలించింది కదా"! అని ఆనందిస్తున్నాడు. కొన్ని మొక్కలూ, చెట్లూ తొందరగా దోహదాన్ని అందుకొంటాయి. త్వరత్వరగా అందుకొని ఎదిగివస్తాయి. కొన్ని చెట్లు బద్ధకించి ఇస్తున్న దోహదమంతా ఏమవుతుందా అన్నట్లుగా ముఖంపెడతాయి. అయినా తోటమాలి ఇస్తూనే ఉంటాడు. వాటి మందకొడితనాన్ని వదలకొట్టడానికి ప్రయత్నాన్ని చేస్తూనే ఉంటాడు. అతడి ప్రయత్నమొక్కటే– లభిస్తున్న దోహదాన్ని అందుకొని అవి పైకి రావాలి? లోకం అతని దోహదాన్ని చూసి మురిసిపోవాలి! అదీ అతని దృష్టి.

మహనీయులు, గురుమూర్తులు అయినవారు ఆ తోటమాలి వంటివారు. సాధకులు, భక్తులు ఆ తోటలోని మొక్కలు, చెట్లవంటివారు. ఇది మనం గమనించాలి! వారు మనకు దోహదాన్ని అందిస్తారు. అవసరాన్నిబట్టి పోషణనిస్తారు. రక్షణనిస్తారు! దారి చూపిస్తారు! ఆ దారి వెంట భయం లేకుండా తోడు ఉంటారు. తప్పుచేస్తే మందలిస్తారు. మంచిచేస్తే ప్రోత్సహిస్తారు. వెంటబడుతుంటే అడ్డుచెబుతారు. ఆత్రపడుతుంటే అడ్డుపడతారు. బాధ్యతలను మరచిన వేళ గుర్తు చేస్తారు.

పూర్ణ జీవితంలో దేనిస్థానం దానికి ఉంది సుమా! అని నొక్కిచెబుతారు. ఇలా ఎన్నో విధాలుగా దోహదం చేస్తారు. మన ఎదుగుదలకు కావలసిన విధంగా నిరంతరం సహకరిస్తూ ఉంటారు. అయితే ఉద్ధరించుకోవలసింది మాత్రం మనని మనమే. అది వారు చేయలేరనికాదు, చేయకూడదు. చేస్తే ఏ మధురానుభూతి కొరకు ఈ నరజన్మ లభించిందో, ఆ మధురానుభూతిని మనంగా అందుకోలేని వారమవుతాం దానిని మనమే సాధించుకోవాలి. అప్పుడే అనుభూతి! ఆ అనుభూతి కోసమే ఇంత



చెరుకుముక్కలుగాని, గ్లాసులోని చెరుకురసంగాని ఇవ్వగలవా? ఆనందస్థితిని తనకు తానుగా సాధించుకోవడంలో మానవునికి అంతటి తృప్తి ఉన్నది. అంతటి తృప్తి లభిస్తున్నది. కనుకనే భగవంతుడు మానవుని ఆనందింప జేయగోరి, 'నిన్ను నీవు ఉద్ధరించుకుంటూ, నాలోనికి ప్రవేశించు' – అని ఒక మహత్తరమయిన అవకాశమిచ్చాడు. **'తీరు'**గా వచ్చినప్పుడు పొందిన తృప్తి, **'తేర'**గా వచ్చినప్పుడు పొందగలమా? ఒకనికి మూడుతరాల ముదరష్టం కలిసివచ్చింది, ఇంటినిండా కోట్లు నిండాయి. నెలకు అద్దెలు లక్షలమీద వస్తున్నాయి. లోటులేదుగాని, ఇచ్చట తృప్తి ఉన్నదా? ఆలోచించండి.

ఒకడు కష్టపడి, ధనం విలువను తెలుసుకొని, చెమటోడ్చి, క్రమంగా తనకున్న పరిచయాలను సద్వినియోగం చేసికొంటూ, కష్టార్జితంగా కొద్ది లక్షల వరకు సంపాదించగలిగాడు. అతడి ముఖంలో ఏదో విజయకేతనం రెపరెపలాడుతోంది. "నేను నా జీవితానికి పదును పెట్టగలిగాను, ఎవరికీ ఏ మాత్రం ఇబ్బంది కలగకుండానే ఈ మాత్రం సంపాదించగలిగాను. నాకిదిచాలు! ఇప్పుడు నాకే లోటూ లేదు". మనస్సు నిండా తృప్తిమాత్రం నిండి ఉంది అనుకొన్నాడతను, మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు. అయినా ఏ వృత్తివలన తాను పైకివచ్చాడో, ఆ వృత్తిని పదిమందికీ మేలు కలిగేటట్లు చేస్తూనే ఉంటానని దేవునితో చెప్పుకొన్నాడు, లోటులేదు. తృప్తి ఉన్నది. పని ఆగదు. బాగున్నది.

కోట్లు నిండినవాడు, ఈ కష్టపడి పైకి వచ్చినవాడు ఒకే వేళన ఎవరింట్లో వారు భోజనం చేస్తున్నారనుకోండి. వారి స్థితి ఎలా ఉంటుంది? మొదటివాడు ఎవరో ఇచ్చిన దానిని తింటూ కూర్చుంటున్నాడు. రెండవవాడు తాను స్వయంగా సంపాదించుకొని ఆ మూడుముద్దలూ ముచ్చటగా తినగలుగుతున్నాడు. అప్పుడు ఒకేసారిగా ఆ రెండు ముఖాలను మనం చూడగలిగితే ఎలా ఉంటుంది అన్నది మీరే చెప్పండి. ఆస్తి వస్తే తీసికోకూడదు అని కాదుగాని, **మనవంతు కష్టం మనం చేయకుండా ఈ భూమి మీద అన్నం తినే అధికారం మనకు లేదు.** అలా కష్టించి సాధించుకొని తిన్న అన్నంలోనే నిజమయిన రుచి మనకు లభిస్తుంది. చూశారా! సాధనచేసి పొందడంలో, సాధనచేసి అందుకోవడంలో ఎంతటి అనుభూతి దాగి ఉన్నదో! కనుక సాధకులారా! ''మానవుడు తనను తానే ఉద్ధరించుకోవాలి" – అన్న గీతాచార్యుని వాక్యం ఎంతటి నిగూఢమైనదో, ఎంతటి రుచికరమైనదో చూడండి.





ప్రతీఅడుగు ఒక లీలా విశేషంగా, చరిత్ర పుటలకు ఎక్కుతోంది? ఆలోచిస్తే ఎన్నో కోణాలు – మనవైపు నుంచి చూస్తే అవసరాలు, కోరికలు–ఆ మహాత్ముని కోణంలో దర్శిస్తే బిడ్డలపై వారి 'అవ్యాజ' ప్రేమాభిమానాలు – ఇది ఒక ఆలోచన మాత్రమే. భిన్న కోణాలను దర్శించే ప్రయత్నం చేద్దాం.

సద్గురురాయా! మీకు అప్పచెప్పబడిన బిడ్డల ప్రగతికై మీరు మానుష రూపేణా వేంచేసిన ప్రతిసారీ జాతిహితం జరుగుతూనే ఉంది. పాత్రలు, పాత్రధారులు తమతమ ఔచిత్యానికి తగ్గట్లు మీ లీలా వినోదంలో భాగస్వాములవుతూనే ఉన్నారు. మాకు మీ చరణాల చెంత ఇంత చోటు ప్రసాదించినందుకు అనేకానేక నమస్సులు. మీరు చూపిన సద్గురుపథంలో మా అడుగులు తడబడుతున్నా, ఆదరువుగా మీరున్నారన్న తలపే మమ్ములను కాపాడుతోంది. వ్యక్తమవుతున్న మీ 'ప్రేమ' మాలో మరింతగా నిలిచేటట్లు, మమ్ము నడిపేటట్లు దీవించండి. ఈ అనంతానంత విశ్వంలో మీరు తప్ప మమ్ము కాచేవారు కానరావట్లేదు. ఈ లీలా వినోదంలో మీ వెంట వచ్చిన ప్రతీ పాత్ర నుండి మాకు నేర్చుకొనే దృక్పథాన్ని, అలవర్చుకునే పరిణతిని ప్రసాదించండి.

సద్గురు స్వరూపులారా! పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కొన్నట్లు సద్గురువు తన బిడ్డలను తమ చెంతకు రప్పించుకుంటారన్నది ఎందరికో స్వానుభవమే కదా! పాల్‌బ్రంటన్ గురించి గత సంచికలలో ప్రస్తావించుకున్నాం. తత్త్వశాస్త్రంలో డాక్టరేట్ పుచ్చుకున్న బ్రంటన్ తత్త్వాన్వేషణలో ఎన్నో పాట్లు పడి చివరకు విసిగి వేసారి భారతం నుండి మరలిపోయే చివరి రోజుల్లో పరమాచార్య స్వామి చెంతకు చేరాడు, చేర్చబడ్డాడు అనడం సమంజసమేమో!

ప్రఖ్యాత రచయిత వెంకటరమణి చనువుతో, చెంగల్పట్టులో విడిది చేసిన స్వామివారి చరణ దర్శనానికి బయలుదేరారు ఇరువురు. అక్కడ ఏం జరిగిందో బ్రంటన్ మాటల్లో "తాటిచెట్లతో దారికి ఇరువైపులా రమణీయంగా ఉన్న రహదారి నుండి ఇరుకైన పెంకుటి వసారాలు, తెల్లటి సున్నం వేసిన ఇళ్ళ మధ్య నుండి చెంగల్పట్టు ఊరి మధ్యభాగానికి చేరుకున్నాము. మమ్మల్ని ఒక జనసమ్మర్దంగా ఉన్న ఇంటివద్దకు తీసుకువెళ్ళారు మతవాసులు. స్వామివారి వ్యవహారాలను చూసే కార్యదర్శుల బృందం – ఉత్తర ప్రత్యుత్తరాల క్రమంలో తీరిక లేకుండా ఉన్నారు. అక్కడి కార్యదర్శులలో ఒకరికి – మేము వచ్చిన సందర్భమేమో తెలియచెప్పి శంకరుల (పరమాచార్య)కు విన్నవించమని వేడుకున్నాడు శ్రీవెంకటరమణి. సుమారు అర్ధగంట తర్వాత నాకు వారి సాన్నిధ్యం లభించడం



కష్టమన్న సమాధానంతో తిరిగివచ్చాడు ఆ అంతరంగికుడు. సుమారు రెండు వందల మంది భక్తులు స్వామివారితో అంతరంగిక దర్శనం కోసం ముందురోజు రాత్రి నుండి చెంగల్పట్టులో విడిదిచేసి వేచి చూస్తున్నారని, అందునా పాశ్చాత్యులను ఇప్పుడు కలిసేంత సమయం లేదని వినయపూర్వకంగా తిరస్కరిస్తూ వెంకటరమణికి తెలియచేసాడు అతడు.

పరిస్థితి అవగతమయి నేను మౌనం వహించాను. అయితే నా స్నేహితుడు వెంకటరమణి – ఒక సన్నిహిత భక్తునిగా పరమాచార్యులను వేడుకుంటానని అక్కడి కార్యదర్శిని ఒప్పించారు. ఎంతో సమయంగా వేచిచూస్తున్న అక్కడి భక్తులు ఇబ్బందిగా గుసగుసలాడుకోవడం గమనించాను. ఎట్టకేలకు వెంకటరమణి తన ప్రయత్నంలో సఫలులడయి విజయదరహాసంతో స్వామి సన్నిధి నుండి బయటకు వస్తూ "ఆచార్య స్వామి మీ పరిస్థితిని అర్థం చేసుకొని, మీకు రాబోయే గంటలో దర్శన, భాషణాన్ని అనుగ్రహిస్తానన్నారు". ఆ గంట సమయాన్ని సుందరమైన ఆ పల్లె వాతావరణాన్ని, ప్రధాన ఆలయాన్ని, మఠ ఏనుగులను కాచే మావటిలతో ముచ్చటించడానికి వినియోగించుకున్నాను. ఆచార్యుల వద్దకు దర్శనానికి వెళ్ళే సమయంలో ఒట్టి చేతులతో వెళ్లరాదన్న సత్సంప్రదాయాన్ని గుర్తు చేసుకుంటూ, కొన్ని కమలాపళ్ళను, పుష్పాలను తీసుకున్నాను స్వామికి సమర్పిద్దామని. స్వామివారి తాత్కాలిక నివాస స్థానానికి చేరుకున్నాను వెంకటరమణితో కలసి. పాదరక్షలు విడిచి వెళ్ళాలని గుర్తుచేసాడు వెంకటరమణి.

ఒక చిన్న తలుపు గుండా ఒక పాతకాలపు ఇంటి గదిలోనికి వెళ్ళాము నేను, వెంకటరమణి. గది చివరలో మసక వెలుతురులో ఉన్న ఒక చిన్న ఆవరణలోని నీడలో ఒక పొట్టిగాను, బక్క పలుచగాను ఉన్న రూపాన్ని చూసాను. వారిని సమీపించి అక్కడ నేను తెచ్చిన ఫల పుష్పాలను అక్కడుంచి సాష్టాంగపడ్డాను. గౌరవభావాన్ని వ్యక్తం చేసే ఈ మర్యాద కంటే, దాని వెనుక ఉన్న రసాత్మక భావం నాకు బాగా నచ్చుతుంది. క్రైస్తవంలోలాగా హిందూ ధర్మంలో 'పోప్' వంటి పెద్ద 'పదవి' ఏమీ లేదని నాకు తెలుసు. అయితే స్వామివారి జ్ఞానము, సౌశీల్యము, ఆచార్యకత్వము చూసి భరతజాతి వారికి మోకరిల్లుతుందని నాకు తెలుసు.

మౌనంలోనే స్వామివారిని దర్శించుకుంటున్నాను. కురచగాను, కాషాయ వస్త్రధారణలోనూ ఉన్న వారు నలభయ్యోపడిలో ఉన్నారని అర్థమయింది. అయితే నెరిసిన వారి తలను చూసి ఆశ్చర్యంగా



## నిన్ను ఉద్ధరించుకొనవలసినది నీవే!



**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః ॥ (6 అ॥ - 5శ్లో॥)**

తనను ఉద్ధరించుకోవలసినది తానే! ఈ సత్యాన్ని మానవుడు గమనించాలి! ఉద్ధరించుకోనే ప్రయత్నంలో అతడు తనకు తాను మిత్రుడవుతున్నాడు. ఉద్ధరించు కోలేకపోతున్న వేళ అతడు తనకుతానే శత్రువవుతున్నాడు. అయితే మనకు దేవతామూర్తులున్నారు. ఎందరో గురుమూర్తులు రూపుకట్టుకొని వస్తున్నారు. మరి వీరందరి మాటా ఏమిటి? వారు మనకు చేయగలిగింది ఏమిటి? చేస్తున్నదేమిటి? – అన్నది ప్రశ్న.

**దేవతామూర్తులుగాని, గురుమూర్తులుగాని నిన్ను నీవు ఉద్ధరించుకొనే ప్రయత్నంలో ఉన్నప్పుడు నీకు సహకరించగలరు. కావలసిన దోహదాన్ని అందించగలరు. అవసరమైన వాతావరణాన్ని రూపొందించగలరు. జరుగుతున్న ప్రయత్నానికి కావలసిన జ్ఞానాన్ని అందించగలరు. నీ మంచిచెడులను పట్టించుకొంటూ సాధన సరిగా సాగేటట్లుగా సలహాలనివ్వగలరు.** కాని ఒక్క నిజాన్ని మాత్రం నీవు గుర్తుంచుకోవాలి. నిన్ను ఉద్ధరించుకోవలసింది మాత్రం నీవే! నీ కథ ఏమిటి అన్నది నీ చేతిలోనే ఉన్నది. అలా ఉంచబడింది. దీనిని మనం గుర్తించాలి! ఇది ఒక రకంగా ఒక మధురమయిన అవకాశం. ఎదుగుదలలోని ఆనందాన్ని అనుభవిస్తూ ఎదగవచ్చు మనం. ఉద్ధరింప బడటంలోని హాయిని అందుకొంటూ ఎదగవచ్చు మనం. కనుక ఇది నిజంగా భగవంతుడిచ్చిన అవకాశమని చెప్పాలి. రా, ఎదిగిరా! నా చెంతకురా! నా లోనికిరా! నేనుగా నిలబడటానికిరా! అని అతడు మనలోనుండి మనలను ఆహ్వానిస్తున్నాడు. ఎంత చక్కని సన్నివేశమిది! ఆలోచించి చూడండి!

కృషి చేసి సాధించడంలో ఒక అనుభూతి ఉంటుంది. అది పొందిన వారికే తెలుస్తుంది. చెరుకు గడను చెక్కి, ముక్కలు ముక్కలుగాకోసి, పళ్లెంలో ఎదురుగా పెట్టి తినమన్నారనుకోండి. ఆ ప్రక్కవాడు ఇంకా కొంచెం ప్రక్కకు వెళ్ళి చెరుకురసాన్నే గ్లాసుల్లో నింపి త్రాగమన్నాడనుకోండి. ఇంతలో కూర్చున్నవాడి కన్ను ఆ ప్రక్కనున్న చెరుకుగడమీద పడిందనుకోండి. అతడు ఏ మాత్రం సాధనా శీలుడయినా ఏం చేస్తాడూ? ఆ చెరుకుగడను తీసికొని, పంటికి పనిచెబుతూ ఆ రుచిని నేరుగా అనుభవిస్తారు. చెరుకుగడను మనంగా కొరుక్కొని తినేటప్పుడు లభించే రుచి, ఆనందం పళ్లెంలోని



ఆస్తిపాస్తులు లేకుండా ఉండాలని, ఎవ్వరి వద్దనుండి ఎటువంటి కానుకలు, విరాళాలు తీసుకోకూడదని ఖచ్చితమైన నియమం పెట్టుకున్నాను. ఎప్పుడైతే అందరూ మనల్ని పూజించాలనుకుంటారో అప్పుడు మనం నిరంతరం జాగ్రత్తగా ఉండాలి. అందుకే నేను చాలా జాగ్రత్తగా ఉంటాను.

**భక్తుడు** : గురువుగారూ! సద్గురువు పట్ల మా ప్రేమ మాకు వివిధ మార్గాలలో విభిన్న స్థాయిలలో అనుభవమౌతోంది. ఈ వ్యత్యాసానికి కారణం ఏమిటి? వివిధ రకాలైన ప్రేమ ఉంటుందా? లేక ప్రేమలోని తీవ్రత యొక్క వ్యత్యాసమే ఆ తేడాలకు కారణమవుతుందా?

**గురువుగారు** : మన సంస్కారాలు, సద్గురువుతో మనకు గల పూర్వసంబంధాలను బట్టి ప్రేమ వివిధ రూపాలను తీసుకుంటుంది. ఒకరు తాను బిడ్డననుకోవచ్చు. ఒకరు శిష్యుడిననుకోవచ్చు. ఒకరు సేవకుణ్ణి అనుకోవచ్చు.

**భక్తుడు** : సద్గురువుకు ఆ పూర్వసంబంధాల గురించి తెలిసి వుంటుందా?

**గురువుగారు** : సాధారణంగా సద్గురువుకు తెలిసి ఉంటుంది.

**భక్తుడు** : శిష్యునికి కూడా తెలియాల్సిన అవసరం ఉందా?

**గురువుగారు** : శిష్యునికి తెలియాల్సిన అవసరంలేదు.

**భక్తుడు** : గురువుగారూ! సద్గురువు చెంతకు చేరుకున్న ప్రతి ఒక్కరికీ పూర్వసంబంధం ఉంటుందా? ఒక వ్యక్తి సద్గురువును తొలిసారిగా కలుసుకునే అవకాశం ఉంటుందా?

**గురువుగారు** : ఒక వ్యక్తి సద్గురువుగా భావించే స్థితికి చేరుకున్నప్పుడు, అది ఋణానుబంధం, పూర్వసంబంధాల వలనే జరుగుతుంది. అంతకుముందు వారిద్దరి మధ్య వేరే రకమైన సంబంధం ఉంటే ఉండవచ్చు. అది గురుశిష్యుల సంబంధం మాత్రమే కావాల్సిన అవసరంలేదు. కానీ ఆ వ్యక్తి "ఆయన సద్గురువు" అనే అవగాహనకు రావడం మొదలుపెట్టాక అది తొలిసారి కలుసుకోవడమయ్యే అవకాశం లేదు. అది వాళ్ల పూర్వజన్మ సంబంధం కారణంగానే జరుగుతుంది.

*– శరచ్చంద్రికలు డిసెంబర్ 2015*

---

**గురుదేవుల నడకలో నడయాడుతున్న నడతే ఆచరణాత్మక బోధగా దర్శిస్తూ, గ్రహిస్తూ, స్వీకరిస్తూ అనుగుణంగా వర్తిస్తూ, ఆ వర్తనంలో ఆయనవాడిగా వర్తమానంలో ఎదగడమే సచ్ఛిష్యుని లక్షణం.**





అనిపించింది నాకు. గంభీరము, దివ్యము అయిన ఛామనఛాయ రంగులోని వారి ముఖారవిందము నన్ను గత స్మృతులలోనికి తీసుకువెళ్ళింది. వారి వదనారవవిందములోని ఆ అంతుచిక్కని, గుహ్యమైన అంశాన్నే ఫ్రెంచిలో 'ఆధ్యాత్మికత' అంటారు – ఆ 'తత్వం' ఎందుకో నాకు స్వామిలో కనిపించింది. గంభీరము, సాత్వికము అయిన ముఖారవిందము, ప్రశాంతము, సౌందర్యంతో ఉట్టిపడే పెద్దకళ్ళు, చిన్నది మరియు తిన్నని ముక్కు, దేహభావం లేకుండా వదిలివేసిన చిన్న మాసినగెడ్డం, ఆకర్షణతో కూడిన వారి స్వరం నన్ను సమ్మోహనుడిని చేసాయి. మధ్యయుగ క్రైస్తవ చర్చికి సంబంధించిన సంతపురుషునిలా అన్పించింది – కాకపోతే ఆచార్య స్వాములకు జ్ఞానమనే గొప్ప సౌరభం కూడా మిళితమయింది. పాశ్చాత్యంలో అయితే వారిని చూస్తే ఒక స్వాప్నికునిగా (కలలు కనేవాడు) – భావిస్తారే కానీ నాకు ఆ కలల కనుల వెనుక ఇంకా ఏదో మర్మం ఉందని, నేను అది మాటల్లో వ్యక్తం చేయలేనని మాత్రం అర్థమయింది.

"పూజ్యపాదులు నన్ను అనుగ్రహించినందుకు కృతజ్ఞుడిని" అని తెలియచేసాను. చిరునవ్వు నవ్వి, నా స్నేహితుని వైపు తిరిగి వారి మాతృభాషలో ఏదో చెప్పారు. నా ఊహ సరైనదే "మీ భాషను స్వామి అర్థం చేసుకోగలరు, కానీ స్వామివారి ఆంగ్లాన్ని మీరు అర్థం చేసుకోలేరని, నన్ను అనువదించి చెప్పమని ఆదేశిస్తున్నారు" అన్నాడు వెంకటరమణి. పాల్‌బ్రంటన్ – స్వామి సంభాషణ ఎలా జరిగింది, స్వామి ఆదేశమేమిటో, రాబోయే సంచికలలో చూద్దాం.

మానవజన్మ, సత్యజిజ్ఞాస, మహాపురుషుల సంశ్రయం. ఇవి మూడు దుర్లభం అంటుంది వివేక చూడామణి. సద్గురువుకక్ష్యలో ఉంటే సులభం అంటుంది సంతుల చరితం. చూసారుగా బ్రంటన్ పరమాచార్య స్వామిని కలసిన మధురక్షణాలలో తన అనుభూతులను! మహాత్ముల దర్శనం మరచిపోయేది కాదు – కలకాలం నిలిచిపోయేది. మా గురుదేవులను ప్రప్రథమంగా –అంతరంగికంగా దర్శించుకున్న రోజులు గుర్తొస్తున్నాయి. వారున్న గదిని సమీపించేసరికి గంభీరము, సింహవదనము అయిన రూపము, మృధుమధురమైన వారి వచనాలు, ఆ జ్ఞానభాస్కరుని చెంతన–విశ్వవిద్యాలయాలచే, 'జ్ఞానపీఠ' గ్రహీతలచే మన్ననలందుకున్న విద్యాచార్యులు అయిన మా అన్న–గురుదేవుల పాదకమలాలకు సేవ చేసుకుంటూ కన్పించారు. ఆ (మా) కుటుంబాన్ని, వారు ఆదరించిన తీరు అనుపమానం. పండిత, పామర, పీడిత జనులందరికీ వారే కదా సాంత్వన. ఆనందసంద్రమే కదా



వారి చింతన. అనుభూతుల ఆనందాలే మనల్ని చేర్చగలవు సద్గురు చరణాలు... ఆచరణాత్మక అడుగులే నిజమైన ఆభరణాలు. ఆ సద్గురుచంద్రునితో మన మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ శతాబ్ది పూర్ణిమకు సాగుదాం. సద్గురు చరణామృతంలో మునిగి తేలుదాం.. **శుభం భవతు...** **– గురుకృప**

## పదముద్రల వెంట పరవశంతో...

### అడుగులో అడుగులు... ఆనందంతో...

ధర్మో రక్షతి రక్షితః అనేది భగవానుని ఉవాచ. ధర్మాన్ని నువ్వు రక్షిస్తే అది నిన్ను రక్షిస్తుంది అని దాని తాత్పర్యం. మరి ఆ ధర్మాన్ని మనం ఎలా రక్షించగలం? తిరిగి దాని నుండి రక్షణ ఎలా పొందగలం? ధర్మాన్ని ఎన్నిసార్లు ఉటంకించినా, పుస్తకాల్లో ఎన్ని విధాల చదువుకున్నా మన మీద దాని ప్రభావం కొంతవరకే ఉంటుంది. కేవలం ధర్మాన్ని ఆచరించడం ద్వారానే అది తగు విధంగా పరిరక్షింపబడుతుంది. తిరిగి అదే ధర్మాచరణ నీ జీవన గమనానికి తోడు, నీడై, నీ ప్రియ భగవానుని సాన్నిధ్యపు కక్ష్యలో ఉంచి నిన్ను రక్షిస్తుంది. అయితే ఆచరణ జరగాలంటే, ఏది ఆచరించాలో తెలియాలి కదా? మన జీవన పయనానికి ఏది ఉపయుక్తమో, దేన్ని త్యజించాలో, ఏది నీ అవసరాన్ని ప్రతిబింబిస్తోందో, ఏది సరైన ధర్మాచరణో తెలియాలి. ఐతే ఏది దాన్ని తెలుసుకొనే దారి?

మానవ పరిణామ క్రమంలో అనుశ్రుతంగా వస్తున్న ఎన్నో ఆచార వ్యవహారాలను, మార్పులను, ధర్మాచరణను ఎందరో మహాత్ములు సమ్మతించారు, విభేదించారు, వ్యతిరేకించారు, ఖండించారు, సమర్థించారు. ఆయా సందర్భాలను బట్టి అవసరాలను బట్టి వస్తోన్న మార్పులను బట్టి వాళ్ళు కాలానికి తగు ధర్మబోధ చేసారు. మానవకళ్యాణానికి ఉద్ధరింపుకూ పట్టం కట్టారు. ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు అన్న ఆ మహనీయునికి శతకోటి వందనాలు.

ఇందరి బోధ – వేదాలు మొదలు, ఎన్నో శాస్త్రవాక్యాలు, మత గ్రంథాలు వాటి వ్యాఖ్యానాల వరకు కుప్పలు తెప్పలుగా ఎంతో జ్ఞాన సంపద ఉంది. మన సంపద ఎన్నో బ్యాంక్ ఖాతాలలో ఉన్నట్లే. వివిధ మతాల పేరిట ఈ జ్ఞాన సంపద ఉండి ఉండవచ్చు గాక! ఐతే అర్హత కలిగి అధ్యయనం చేసి లక్ష్యాన్ని తెలుసుకొని, మార్గాన్ని నిర్దేశించుకొని మనలో ఉన్న ఆనందాన్ని ఆ స్వరూపాన్ని ఆవిష్కరింపజేసుకోమంటోంది, ఆ ఆనందాన్ని అపరిమితం చేసుకుంటూ తరించ





**గురువుగారు** : మంచిదే. నేనూ అదే చెబుతున్నాను. మీరు నన్ను ఎలా చూస్తున్నారన్నదే ముఖ్యం. నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాననేది ముఖ్యం కాదు.

**భక్తుడు** : గురువుగారూ! మీరిక్కడ తిరువణ్ణామలైలో ఉండటం మా అదృష్టంగా భావిస్తున్నాము. మీ ప్రబోధానికి మేమెంతో కృతజ్ఞులం.

**గురువుగారు** : చాలా రోజుల నుండి తిరువణ్ణామలై పట్ల ఇది నా స్వంత ఊరు అనే భావన ఉంది. అందుకని ఇక్కడకు వచ్చి కొంత సమయం గడపాలనుకున్నాను. ఆ తరువాత మీరు వచ్చారు. మీతో కలిసి కూర్చుని మాట్లాడటం జరిగింది, అంతే. నేనేదో మీకు బోధిస్తున్నట్లు నేను భావించడం లేదు. మీరు వచ్చి నా ఉపన్యాసాలు వినమని ఎవ్వరికీ ఆహ్వానాలు పంపలేదు. పత్రికలలో ప్రకటనలు ఇవ్వలేదు. తనవద్ద ఉన్నదానిని సాటివారితో పంచుకోవడమన్నది స్వాభావికమైన మానవధర్మం. దానికి అనుగుణంగానే నేను పంచుకుంటున్నాను. అనవసరంగా అందరూ నన్ను "గురువుగారూ" అని పిలుస్తున్నారు. నేను గురువును కాదు. ఇక్కడకు వచ్చేవాళ్లకు ఒక గురువు కావాలి. నాలో వాళ్లు గురువును చూసుకుంటున్నారు. "గురువుగారూ" అని పిలుస్తున్నారు. అది వారి అవసరం. అందుకే నేను మౌనంగా ఉంటున్నాను. నాకు శిష్యులు అవసరంలేదు. కాబట్టి నేను వారిని ఆ దృష్టితో చూడను. శిష్యులు లేకుండా గురువు ఉండగలడా? 'గురువు' అన్న పదం సాపేక్షమైనది.

**భక్తుడు** : మీరు మీకెవరూ శిష్యులు లేరంటారు, కానీ వాళ్ళేమో మీ శిష్యుల మంటున్నారు.

**గురువుగారు** : వాళ్లు అలా అంటే అనవచ్చు. ఎందుకంటే వారి మనస్సులోని భావాన్ని అలా వ్యక్తం చేయడం వారికి అవసరం కావచ్చు. వాళ్లతో వద్దు అని చెప్పడానికి నేనెవరిని? వాళ్ళు ఏం చెప్పాలనుకుంటున్నారో దానిని చెప్పడం వాళ్ల హక్కు. కొంతమంది నేను మోసగాడిని అని చెప్పవచ్చు. అటువంటి వాళ్లకూ అలా చెప్పే స్వేచ్ఛ ఉంది. వాళ్ళ అభిప్రాయాలు వాళ్ళకి ఉండవచ్చు. నన్ను విమర్శించడం వాళ్ళ అవసరమైతే, వాళ్ళను అలానే చెయ్యనివ్వండి. నన్ను పూజించడం కొంతమందికి అవసరమైతే వారినీ అలా చెయ్యనివ్వండి. వాళ్ళ భక్తిని నేను నా అవసరానికి వాడుకోనంతవరకు, వారి భక్తి వారిలోని ఒక అవసరాన్ని తీరుస్తున్నంతవరకు నేను చేసేది కేవలం పంచుకోవడం మాత్రమే. ఇది జబ్బుతో ఉన్న వ్యక్తికి మందివ్వడంలాంటిది. నేను వాళ్ళ వద్దనుండి విరాళాలు తీసుకొని, ఆశ్రమం కట్టడం మొదలుపెడితేనో, లేక వారి వద్దనుండి కానుకలు స్వీకరిస్తేనో నాపట్ల వారికి ఉన్న భక్తిని నేను వాడుకోవడానికి అవకాశం ఉంటుంది. అందుకనే నేను, నాకు ఎటువంటి



**భావించుకోవడంలేదని ఆయన ఉద్దేశ్యం.** తమకు శిష్యులెవరూ లేరని చెప్పినపుడు రమణమహర్షి భావం కూడా ఇదే. నేను చెప్పినా నా ఉద్దేశ్యమూ అదే. నన్ను నేను గురువుగా భావించుకోను. నేను గురువును కానప్పుడు నాకు శిష్యులెలా ఉంటారు? రమణమహర్షి దీనిని చాలాచాలా స్పష్టంగా చెప్పారు. **గురువు తనను తాను మీకు గురువుగా చేసుకోడు. ఆయనను గురువుగా చేసుకోవలసింది మీరే. నన్ను నేను బాబా భక్తునిగా భావించుకుంటున్నాను. కానీ బాబా నన్ను తన భక్తుడినని లేదా శిష్యుడినని అనుకోకపోవచ్చు. దాని గురించి నాకు చింత లేదు. నేను నావైపు నుండి, నా అనుభవంలోనుండి మాట్లాడుతున్నాను. బాబా దీనిని ఎలా అనుభూతి చెందుతున్నారని నేను ఆలోచించను. మీరు బాబాను గురువుగా చూస్తే అది సరైనదే. అదే అసలు సూత్రం. మహాత్ముల మార్గం కూడా అదే. గొప్ప మహాత్ములు తమను తాము గురువులుగా ఎన్నటికీ భావించుకోరు. మనం వారి వద్దనుండి ఈ ఆదర్శాన్ని, సందేశాన్ని తీసుకోవాలి.** అంతటి మహాత్ములే తమకు శిష్యులున్నారని చెప్పనప్పుడు ఆ మాట అనడానికి రేణువుల్లాంటి మనమెంతటివారం?

**భక్తుడు** : కానీ, మనల్ని మనం శిష్యులుగా భావించుకోవచ్చు కదా గురువుగారూ?

**గురువుగారు** : మీకు ఎలా కావాలంటే అలా భావించుకోవడానికి మీకు సర్వహక్కులూ ఉన్నాయి. (గురువుగారు నవ్వుతూ) మిమ్మల్ని మీరు భక్తులుగా కూడా భావించుకోవచ్చు. ఎలా అనుకున్నాసరే, అలా అనుకోవడం మీవైపు నుండి జరుగుతుంది. నిజానికి ఇదే ముఖ్యం. మీరెలా అనుకుంటున్నారనేదే ముఖ్యం. మీరు నన్ను ఎలా చూస్తున్నారు అనేది ముఖ్యం కానీ నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాననేది కాదు. నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాననేది కూడా ముఖ్యమైనదే, కానీ మీరు దానిని అర్థం చేసుకోలేరు. ఆ సంబంధాన్ని ఇంగ్లీషు నిఘంటువును చూసి వేదాంత పరిభాషతో ఫలానా అని ముద్ర వేయకండి. నేనేమిటి, నేనెలా ఆలోచిస్తాను, నేను మిమ్మల్ని ఎలా చూస్తాను – వీటిని మీరు నిఘంటువులో చూసి తెలుసుకోలేరు. కాబట్టి దాని గురించి ఆలోచించవద్దు. అలాంటి ఆలోచనలతో మిమ్మల్ని మీరు ఇబ్బంది పెట్టుకోవద్దు. మీరు నాతో ఒక అనుబంధాన్ని కలిగి ఉండి దానివలన మీకు తగిన సమాధానం దొరుకుతుంటే అది చాలు.

**భక్తుడు** : గురువుగారూ! నేను జీవితపర్యంతం దేనికోసమైతే వెతుకుతున్నానో అదే మీరు. ఇప్పుడు ఇక్కడ మీరు నా కళ్లముందు భౌతికంగా ఉన్నారు. నేను మీతో ఎలా ఉండాలో, మీలా ఎలా ఉండాలో మీ వద్ద నుండి నేర్చుకోవాలనుకుంటున్నాను.





మంటోంది ఆ జ్ఞానసంపద, ధర్మబోధ. కానీ అది సాధ్యమా మనకు? ఎందుకంటే మనలో ఉండే ఎన్నో భావావేశాలవలే ఆ శాస్త్రాలలోనూ ఎన్నో వైరుధ్యాలూ, పోలికలూ సమన్వయాలూ, వాదాలూ సైద్ధాంతిక విభేదాలు ఉన్నాయి.

ఒకసారి ఒకటి మనల్ని ఒకవైపుకు లాగితే, మరోసారి తద్విరుద్ధంగా మరో వైపుకు లాగుతుంది. ఒకసారి సమన్వయం అయినట్లే ఉంటుంది. ఇంతలో మరో వైరుధ్యం తొంగి చూస్తూ ఉంటుంది. ఇంతటి ప్రయాసల్లో వాదోపవాదాల్లో మనిషి చిక్కి నిస్సహాయంగా ఏదో ఒక సిద్ధాంతానికి కట్టుబడి మొక్కుబడిగా రాజీపడి జీవనం సాగించడం చూస్తూ ఉంటాం! అటువంటి ఏదో ఒక సిద్ధాంతం వాస్తవంగా మనిషి యొక్క అవసరాన్ని తగురీతిలో ప్రతిబింబించని కోణాల్లో నుంచి ఎన్నో సందేహాలూ, అసంతృప్తులూ తలెత్తుతూనే ఉంటాయి. అంతమేరకు మనం తిరిగి ఏది సరైన ధర్మాచరణ అని అప్రయత్నంగా వెదుకుతూనే ఉంటాం. ప్రయత్నిస్తూనే ఉంటాం. మరి ఏది దాన్ని తెలుసుకొనే దారి?

అప్పుడు ఎందరో మహాత్ముల జీవిత చరిత్రలూ ఆ అనుభవాలూ సజీవ వ్యాఖ్యానాల వలే శాస్త్ర ప్రమాణాలుగా మనకు కనబడవచ్చు. ఎన్నో శాస్త్రాల సమన్వయం గూడా వారి జీవన పయనంలో మనకి దొరకవచ్చు. కానీ ఆ మహాత్మునికి మాత్రం వాళ్ళ అవసరమే అర్హతగా, అనుభవమే ప్రమాణంగా మొదలై, వాళ్లలోని అవసరాన్ని తపననూ ప్రతిబింబించే సూత్రాన్నో, వ్యక్తినో గురువుగా తెలుసుకొని జీవితాన్ని మలుచుకొని లక్ష్యాన్ని చేరుకున్న మహా మహనీయులు పూజనీయులు ఈ మహాత్ములు. వారి గాథలు, జీవన విశేషాలు శాస్త్ర వాక్యాలుగా మనం చదువుకోవచ్చు, తెలుసుకోవచ్చు స్ఫూర్తి పొందనూవచ్చు. ఐతే వాళ్ళను చూసి అధ్యయనం చేసి మనం ఏదేనీ చేయడానికి మొదలుపెడితే అది అలా పొసగదు. ఎందుకంటే వాళ్ళు వాళ్ళ అనుభవం నుండి, అవసరం నుండి మాత్రమే మొదలుపెట్టారు. కానీ వేరే వాళ్ళను చూసి కాదు, ఏదో అధ్యయనం చేసి కాదు. వాటిల్లో దొరికే ఎన్నో మార్గాలలో, లక్ష్యాలలో, ఆచరణల్లో మనదైన మార్గమేమిటి? అవసరమేమిటి? ధర్మాచరణ ఏమిటి? దాన్ని తెలుసుకొనే దారి ఏమిటి? మళ్ళీ అదే ప్రశ్న.


ఇంతటి కలగాపులగంలో జ్ఞానం పేరుతో మనల్ని మనం బలిపెట్టుకోనీయకుండా, అన్వేషణ పేరుతో, అలసత్వం, నిస్పృహ మనను ఆవరించనీయకుండా, అరువు తెచ్చుకున్న భావాల పరంపరలో కొట్టుకుపోతూ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టుకోనీయకుండా, ఆధ్యాత్మికత పేరుతో ఇల్లు, వళ్లు గుల్ల



చేసుకోనీయకుండా, గురువులూ, ఆశ్రమాలూ, మంత్రోపదేశాల పేరుతో దగాపడి ఎటుపోవాలో తెలియని అయోమయ స్థితి రానీయకుండా, ఊహల ఊరింపులో ఆశల నిరాశల్లో నిస్తేజంగా కాలక్షేపంగా జీవితాన్ని సాగించనీయకుండా, సైద్ధాంతిక విభేదాల పేరిట అహం స్ఫురణతో వాదోపవాదాల్లో, వివాదాల్లో చిక్కి సమయం వృథా కానీయకుండా తిరుగుబాటు విప్లవం, అంటూ అసమానతలపై పోరాటం చేస్తూ, తెగింపు అంటూ జీవితానికి ముగింపు పలకనీయకుండా, అన్నింటినీ మించి మననుండి ఏమీ ఆశించకుండా మనమంటూ ఉన్నామనేది-ఎవ్వరికీ పట్టని ఇంతటి మహాసృష్టిలో, విశాల విశ్వములో మనల్ని వెతుక్కుంటూ అవ్యాజకరుణానుబంధంతో కదిలి వచ్చి చేయి అందించి- నీ అవసరమేమిటి? నీకేమి కావాలి అని అడిగే ఆ ప్రేమమూర్తిని మనం ఏమని అడగగలం? మన అవసరం ఏదని చెప్పగలం? తిరిగి వారికి మనం ఏమి ఇవ్వగలం? ఏం సమర్పించుకోగలం? అలా మనం ఇవ్వగలగడం అపోహ కాకపోతే-వారి ఆత్మీయతనూ, ప్రేమనూ పొందిన ప్రతి ఒక్కరూ ప్రాణాలే ఇవ్వగలం అని బీరాలు పలకరు? అంతటి భావావేశం సృష్టిస్తారు మరి-వారు వారి పరిచయంలో, వారితో పరిచయం ఎంతటి మహోత్కృష్టమైనదో, ఎంతటి అమూల్యమైనదో, ఎంత ప్రేమమయమో ఆ పరిచయ భాగ్యం పొందిన ప్రతి ఒక్క మదికి అర్థం అవుతుంది.

ఎన్నిసార్లు తలచుకున్నా ఎంతమందితో పంచుకున్నా ఎన్ని విధాల వ్రాసుకున్నా ఆ మహనీయుని సాన్నిధ్యాన్ని చేరుకున్న ప్రతి ఒక్కరికీ-ఆ పరిచయ ఘట్టం ఎప్పటికీ ఆనందాన్ని కలగజేస్తూనే ఉంటుంది. నిస్సహాయంగా నిస్తేజంగా సాగిపోయిన కాలం-వారి ఆగమనంతో ఎంతో వైభవాన్ని సంతరించుకొని ఆ కాలాన్ని గూడా మరచిపోయే ఆనందపు అంచులను పరిచయం జేస్తుంది. విసుగు చెందించే, కలత చెందించే ఎన్నో ఆలోచనలు, భావావేశాలూ ఆ ప్రేమమూర్తి పరిచయంతో ప్రేమతో నిండి తడిసి ముద్దై ప్రేమ వ్యక్తీకరణలో నిమగ్నమైపోతాయి. వారిని దర్శించుకున్న ప్రతీసారి వారి చుట్టూ ఉన్న జడ అజడ పదార్థమంతా వారిలోని ఎంతో కొంత పవిత్రతను, సొగసునూ అద్దుకొని వారిని ప్రతిబింబించే ప్రయత్నంలో సరిక్రొత్తగా సాక్షాత్కారాన్ని, దర్శనాన్ని చేయిస్తూ దర్శన నిర్వచనాన్ని విస్తృతి చేస్తూ పోతుంది. మౌనంలోని మాటలా? మాటల్లోని మౌనమా? సందిగ్ధతలో దీనికి ముగ్ధత చెందుతున్నామో తెలియక పరవశిస్తూ అణువణువూ పులకిస్తూ వారి మాటలకూ







## గురువు - శిష్యుడు *డిసెంబర్ 2015*

**భక్తుడు** : గురువుగారూ! భక్తునికి, శిష్యునికీ మధ్య తేడా ఏమిటి?

**గురువుగారు** : ఒక వ్యక్తిని లేదా దేవతామూర్తిని ప్రేమిస్తూ, అంకితభావంతో వారిని ఆరాధిస్తూ, పూజిస్తూ ఉండేవాడు భక్తుడు. గురువు విధించిన ఓ నిర్దిష్టమైన సాధనా పద్ధతిని అనుసరించేవాడు శిష్యుడు. **శిష్యుడంటే శిక్షణ ప్రధానమైన అంశం:** అక్కడ ఒక ఉపదేశం, ఒక మార్గం, అనుసరించాల్సిన నియమాలు, విషయాలు ఉంటాయి. భక్తుడంటే అతనికి ఒక వ్యక్తి పట్ల లేదా ఒక విషయం పట్ల భక్తి, ప్రేమ, ఆరాధన ఉంటాయి. భక్తుని విషయంలో ఇవే ప్రధానం. బాబా సాంప్రదాయరీతిలో ఎవరికీ ఎటువంటి సాధననూ నిర్దేశించలేదు. కాబట్టి బాబాకు శిష్యులంటూ ఎవరూ లేరని చెప్పవచ్చు. **నిజానికి మనకు క్రమశిక్షణ లేదని బాబాకు తెలుసు కాబట్టే ఆయన, "నాకు శిష్యులు ఎవ్వరూ లేరు" అని అన్నారు (నవ్వులు)**

**భక్తుడు** : గురువుగారూ! మీకు శిష్యులు లేరని ఎందుకంటారు? నా దృష్టిలో శిష్యుడు అంటే తన గురువు పట్ల భక్తిభావాన్ని కలిగి ఉండి వారి వద్దనుంచి తాను ఏదో నేర్చుకుంటున్నాను అని భావించేవాడు. అక్కడ (వాచా) వ్యక్తమైనా కాకపోయినా అక్కడ (గురు) ప్రబోధం ఉంటుంది. నా వరకు నన్ను నేను ఒక శిష్యునిగానూ, భక్తునిగానూ భావించుకుంటున్నాను. మీరు, "నాకు శిష్యులెవ్వరూ లేరు" అని చెప్పడంలో ఏదైనా ప్రత్యేకమైన కారణం ఉందా? బాబా తమకు శిష్యులున్నారని చెప్పలేదా?

**గురువుగారు** : తమకు శిష్యులెవరూ లేరని బాబా స్పష్టంగా చెప్పారు. ఈ విషయాన్ని బాబా చెప్పారు. రమణమహర్షి చెప్పారు. తమకు శిష్యులున్నారని అనుకునేవాళ్లు వందలాదిమంది ఉన్నారు. వారిని గురించి నేను మాట్లాడటంలేదు. బాబా, రమణమహర్షి వంటి గొప్ప మహాత్ములే తమకు శిష్యులెవ్వరూ లేరని చెప్పినపుడు నాకు శిష్యులున్నారని చెప్పడానికి నేనెవరిని? **నాకు బాబానే ఆదర్శం. ఆయనే నా గురువు, దైవం, ఇష్టదేవతాస్వరూపం.**

**భక్తుడు** : "నాకు శిష్యులు లేరు" అన్నప్పుడు బాబా ఉద్దేశ్యం ఏమిటి గురువుగారూ?

**గురువుగారు** : బాబా ఇంగ్లీషు నిఘంటువు (డిక్షనరీ) చూసి పదాలకు నిర్వచనాలు చెప్పలేదు. (గురువుగారు నవ్వుతూ...) ఆయన తమకు శిష్యులెవరూ లేరన్నారు. అంటే, **తమను తాము గురువుగా**



ఒక నిర్మాణాత్మకమైన ఆలోచనా విధానం కావాలి గురుదేవుల బోధ పట్ల, వారి ఆదర్శాల పట్ల. ఆయన పట్ల మనకు ప్రేమ ఉందనే మాటకు మన ఆచరణ జతకావాలి. మన సమయం, ధనం, శక్తి వినియోగించడంతోపాటు వారి ఆదర్శాలను భుజాలపై వేసుకొని జీవితాంతం మోయగలిగే శ్రద్ధాసక్తి కూడా కావాలి. ఏమరుపాటు లేని విచక్షణ కావాలి. అన్నింటినీ మించి వారి ప్రేమను పొందిన ప్రతి ఒక్క హృదయం వారి మందిరం కావాలి.

అక్కడ వారిని మనం దర్శించుకోగలగాలి. ఆ ఆదర్శాల రూపంగా, సాయి ప్రతిరూపంగా అప్పుడే వారి ప్రత్యేకత ముందు తరాలకు సరైన రీతిలో అందించబడుతుంది. వారి ధర్మబోధ కలకాలం పరిరక్షింపబడుతుంది. వారు **"ఎన్నోసార్లు ఎంతో ఇష్టంగా మనకు చెప్పిందీ మన నుండి ఆశించిందీ... మన ఆ ఆచరణలోని ప్రత్యేకతే"**. "వీళ్ళు సాయిపథం వాళ్ళురా, వాళ్ళ పద్ధతే పద్ధతి అని అనగలిగి ఉండాలి చూసే ఎవరయినా" అని అన్నారు గురువుగారు. కాబట్టి "పద్ధతిని బట్టి, ఆదర్శాల పట్ల ఆచరణను బట్టి, సాయిపథంగానీ కేవలం ఆయన ఫోటో ఒకటి పెట్టుకొని, నాలుగుసార్లు సత్సంగానికి పోతూ ఉంటే సాయిపథం కాదు" అని నిష్కర్షగా, నిర్మొహమాటంగా తేల్చేసారు గురుదేవులు.

ఆ విధంగా వారిలోని ప్రత్యేకత – ప్రేమ బంధంగా మనందరిలోనూ ప్రతిబింబించాలి. తదనుగుణంగా మన జీవనం సాగాలి. కనీవినీ ఎరుగని ఒక మహత్తరమైన ఒక గొప్ప సంప్రదాయకర్తగా, సాయి స్వరూపంగా, సాయితత్త్వపు సమిధిగా–సాయిపథాన వారి ప్రత్యేకత ఉంటే ఆచరణాత్మకమైన మన నడవడిలో, నడకలో, మన ప్రయత్నంలో–మన ప్రత్యేకత ఉండాలి సాయిపథాన. **'సాయిపథం'** అనేది కేవలం మన మాటల్లోనో, పుస్తకాలలోనో, బోర్డులపైనో మాత్రమే కాకుండా మన జీవనశైలిలో కూడా ఉండాలి. జీవితం నిత్యప్రవాహంలా, సరిక్రొత్తగా జీవంతో ఉండాలి. దానికి తగినట్లుగా మన అడుగులూ పడాలి. అప్పుడే అది సజీవంగా మన ప్రయత్నమేమీ లేకుండానే ముమ్ముందు తరాలకు సజీవంగా అందించబడుతుంది. దానికోసం ప్రతి ఒక్కరూ ఏమరుపాటు లేకుండా, తమని తాము తరచి తరచి చూసుకుంటూ సరి చేసుకుంటూ పయనిద్దాం! అరమరికలూ, పొరపొచ్చాలూ లేకుండా ఆనందంగా పయనిద్దాం! ఒక్కటే నినాదంతో **ఆనందపథం... సాయిపథం...** అని అంటూ ఎలుగెత్తుతూ... పయనం సాగిద్దాం...

**–గురుకృప**





ప్రేమైకభాషణాలకూ ఎప్పుడూ చవిచూడని భావావేశాల మత్తులో నిజమైన మౌనాన్ని వహిస్తాం. మంత్రముగ్ధులమైపోతాం.

యాంత్రికంగా మారిన శాస్త్ర విజ్ఞాన సారమైన ధర్మాచరణ అంతా తంతులుగా తెలియవచ్చి నిజమైన జ్ఞానం వారి పరిచయంలోని వారి ప్రేమ వ్యక్తీకరణగా, అనుభవంగా, సరిక్రొత్తగా సముపార్జన జరిగి చేయవలసిన **అసలైన ధర్మాచరణ – 'వారి పట్ల మన ప్రేమకు వ్యక్తీకరణ'గా అవగతమౌతుంది.** అటుపై మనలోని అవసరాన్ని కొరతనూ తీరుస్తూ వారి అంతులేని ప్రేమకు, ప్రతిఫలంగా ఏర్పడిన వారి పరిచయ భాగ్యమనే పరిణయం సరిక్రొత్త జీవిత పంథాకు నాంది పలుకుతూ–సిసలైన ధర్మాచరణ మనలను బద్ధులను చేస్తూ, శుభ్రమార్గాన్ని చూపుతూ, వారి అడుగుల వెంట పరుగులు పెట్టిస్తుంది. అంతటి మహదవకాశం, మరలిరాని అవకాశం–వారి పరిచయభాగ్యం. మన జీవితకాలంలో ఇంతటి మహోన్నత వ్యక్తిని ఒక్కసారి దర్శించుకున్నా చాలు అని అనిపిస్తుంది. వారిని దర్శించిన ప్రతి ఒక్కరికి అటువంటిది ఒకటా, రెండా! ఎన్నెన్ని ఆశ్చర్యానందాలు? ఎన్ని రకాల భావావేశాలు? ఎటువంటి అనుభవాలు? అనూహ్యమైన జీవితఘట్టాలు? ఆనందమైన ప్రత్యక్ష సాన్నిధ్యం పొందిన సమయాలు, వారి వెంట ఎన్ని ప్రయాణాలు? వారి పాదాల చెంతచేరి ఆపాదమస్తకమూ పులకరించేలా విన్న వారి సత్సంగ భాషణాలు? వారి ముఖతా తెలుసుకున్న ఎన్నో జీవితపాఠాలు? సాయినాథునిపై ఉవ్వెత్తున ఎగిసిపడే వారి ప్రేమ, వారు వేసే ప్రతి అడుగులోనూ వారి దైవం పట్ల వారికున్న తిరుగులేని నమ్మకం, కలలోనూ సడలని వారి విశ్వాసం ఆ దైవంతో..

ఏకత్వంగా మనకు అర్థమయ్యే వారి ప్రవర్తన–బాబాను బాబాగా చూస్తూ చూపిస్తూ ఏ ఒక్క సంప్రదాయానికి ముడిపెట్టకుండా ఒక సరికొత్త పథానికి శ్రీకారం చుట్టిన వారి విధానం. ఎదుటివారికి భరోసా కలిగేలా వారి ధైర్యవచనాలు, ధైర్యం నూరిపోసే వారి తీరు, నిర్మలమైన వ్యక్తిత్వం, ఆదర్శాల పట్ల వారి నిబద్ధత, రాజీలేని వ్యవహారశైలి, ఎవ్వరినైనా మన్నించి–వాళ్ళ పొరబాట్లనూ, తప్పులనూ సరిదిద్ది, బాబాపథంలో పెట్టే వారి క్షమాగుణం, విశాల దృక్పథం. ఆ దారిలో ఆ చెట్ల నీడన సేద తీరని బాటసారి ఎవరు, ఆ చల్లని నీడను దారి పొడవునా అనుభవించనిదెవరు, వారి వద్దకు వచ్చిన అందరినీ, బాబా ప్రసాదంగా స్వీకరించగల సమర్థత, అచంచలమైన, అనితర సాధ్యమైన వారి బాబా భక్తికి నిదర్శనం.



ఒకటా రెండా ఎన్నెన్ని చెప్పుకోగలం మనం వారి గురించి తెలుసుకొన్నవి, దర్శించుకొన్నవి, అనుభవించినవి. **వారి మృదు మధుర నిష్కల్మష దరహాసం పొందిన వారికి అశ్రుపూరిత నేత్రానందమేగా! వారి మనోహర రూపంలో అణువణువునూ చూసుకుంటూ వ్యక్తావ్యక్త భావాలతో నిండిపోయిన మదిలో ఎంతటి ఆనందాతిశయం? వారి ప్రతి కదలికా ఒక సరిక్రొత్త అనుభవంగా వారి ప్రతి మాటా ఒక వేదవాణిలా వారికి సంబంధించిన ప్రతీ అంశమూ మన జీవితంగా మారిపోయేట్లుగా సాగింది వారితో మన ప్రయాణం.** ఒక మహా పర్వం ఒక అద్భుత చరితం అప్రహితంగా సాగిపోయింది. కాలమే సాక్షిగా వారి ప్రేమ పొందిన ప్రతి ఒక్కరి అనుభవాలే ప్రమాణంగా ఆ సాయినాథుడు సృష్టించిన అద్భుత ఘట్టంగా హోరెత్తుతూ పరవళ్లు తొక్కుతూ సాగిపోయింది కాలం. వారితో అనుబంధం, అనుభవం ఉన్న ఏ ఒక్కరి మాటలు విన్నా, చూసినా, కదిలించినా వాళ్ళ కళ్ళలో తిరిగే నీటిసుడులు చెబుతాయి–ఆయన నుండి వాళ్ళు పొందిన ప్రేమ ఎంతటిదని, తద్వారానే మనచే వారిని దర్శింపజేసి–చేయెత్తి నమస్కారం చేయించేలా చేయిస్తుంది. ఆహా ఏమి ఈ కాలం? ఈ వైభవం? అద్భుతం, అజరామరం.

అయితే వారి విశిష్టతను, గొప్పతనాన్ని, ప్రేమను వారి సాన్నిధ్యంలో గడిపిన కాలాన్ని వర్ణించటానికి ఇలా ఎన్ని పుటలు నింపుకున్నా గమ్మత్తైన ఎత్తుగడలతో ఎన్ని కవిత్వాలు వ్రాసుకున్నా, చందోబద్ధంగా ఎన్ని పద్యాలు పాడుకున్నా, స్మృతిపథంలో మెరిసే ఎన్నో జ్ఞాపకాలను గ్రంథస్థం చేసుకున్నా, వారిని వర్ణించడం సాధ్యమా? ఆ వర్ణన సరిపోతుందా? అలా అందరి అనుభూతులు, జ్ఞాపకాలతో వారి జీవిత విశేషాలతో వారిదీ ఒక జీవిత చరిత్రగా పుస్తక రూపం దాలుస్తుంది.

ఐతే ఎందరో మహాత్ముల చరితల సరసన వారిదీ ఒక చరిత్ర మాత్రమేనా? ఎందరో మహాత్ములకున్న మందిరాలవలే మన స్వామికి ఒక మందిరం మాత్రమేనా? ఎన్నో ఆధ్యాత్మిక మార్గాలవలే వారు చూపినదీ ఒక మార్గమేనా? **వారు సృష్టించిన ఆధ్యాత్మిక విప్లవం**–ఆ జెండాను మోసే ఒకరిద్దరికి మాత్రమే పరిమితం చేద్దామా? సాయే మార్గంగా సాయే లక్ష్యంగా, వారి జీవితమే ఆదర్శంగా సర్వ మానవాళి కోసం వారు పూరించిన శంఖారావం, ఢంకా ధ్వానం మేమూ విన్నాం! అని చెప్పుకుంటూ చప్పట్లు చరచుకుంటూ, గొప్పలు చెప్పుకుంటూ మన పని మనం చేసుకుంటూ జీవితాన్ని వెళ్లబుచ్చుదామా? ఏ మనిషి, ఏ ప్రాంతం, ఏ కులం, ఏ వర్గం, ఏ మతం, ఏ జాతి, ఏ భాష అనే





హద్దులు చెరిపేస్తూ, వాటిల్లోనే ఐక్యత కోరుకునే లౌకికవాదాన్ని, అసలు వాదంగా పట్టించుకోకుండా అన్నింటికి అతీతంగా తీసుకువెళ్ళి మనిషిని మనిషిలా గుర్తించి, ప్రేమించి ప్రతి ఒక్కరూ ఉద్యుక్తులయ్యేలా, ఉద్యమించేలా వారిచ్చిన పిలుపు–**సాయివంటి దైవం లేదని** ఎలుగెత్తి చాటే వారి పవిత్ర ఆశయం–కేవలం సత్సంగాలలో చదువుకోవడానికే మాత్రమే పరిమితం చేసుకుందామా? వారికంటూ వారిదైన ప్రత్యేకత ఏదీ లేదా? వారినీ ఒక గొప్ప మహాత్ములు అంటూ చరిత్రలో కలిపేస్తామా? వారు వారించిన ఎన్నో తంతులను విధానాలను వారిని పూజించడానికే వినియోగిస్తామా? లేదా వారి నుండి పొందిన ఆనందానికి కృతజ్ఞతగా, ఉడతాభక్తిగా ఏమైనా సమర్పించుకుందామా? **అంతటి మహోన్నతుని ప్రేమకు ప్రతిగా మనం తిరిగి ఏం ఇవ్వగలం? ఏం సమర్పించుకోగలం? ఒక్కటే అనిపిస్తుంది–వారు చూపిన శుభ్రమార్గంలో ఏమరుపాటు లేకుండా నడవడమే, అలా ప్రయత్నించడమే మనం వారికి సమర్పించుకోగలిగింది. అది గూడా వారు చూపిన ప్రేమకు ప్రతిఫలమేగాని, అదేదో మనం ఇవ్వగలిగేది కాదు–వారు తీసుకొనేది అసలే కాదు.**

మనిషి అవసరం మాత్రమే అర్హతగా ప్రతిఫలం ఏమీ ఆశించకుండా ఆ అవసరాన్ని తీరుస్తూ వాళ్ళ జీవితాలను సాయికి ముడివేస్తూ వారికి ఓ గొప్ప పథాన్ని చూపుతూ లక్ష్యాన్ని తెలియ చెపుతూ ఎక్కడా తమదైన పేరుకానీ, ఫోటో కాని పెట్టడాన్ని వారిస్తూ, సాయే గమ్యంగా పయనం సాగించాలనీ వారిని మాత్రం ఒక వ్యక్తిలా కాకుండా, ఒక ఆదర్శంలా చూడాలన్న వారి మహదాశయం ఎంత గొప్పది. ఎక్కడా విననిది, ఏ చరిత్రా చూడనిది. **యత్ర యత్ర రఘునాథ కీర్తనం** అని కీర్తించినట్లుగా ఎక్కడ బాబా చిత్రపటం ఉన్నా, సాయిని సాయిగా చూసే తీరులో వారి ఆదర్శాల రూపంలో, ఆచరణాత్మకంగా పనిచేసే తీరులో అక్కడే గురుదేవులు తిష్ట వేసుకొని కూర్చొని ఉంటారు.

కాబట్టి వారి పట్ల మన ప్రేమకు వ్యక్తీకరణగా ఆచరణాత్మకమైన అడుగులు వారి అడుగులవైపు, వారి ఆదర్శంవైపు పడాలి. ఏ మహాత్ముని సంప్రదాయమయినా కలకాలం అందరిలో మనగలగాలంటే, ఒకటి ఆ మహాత్ముని మహిమ నిరాటంకంగా ప్రకటం గావడం. రెండు ఆ మహాత్ముని అనుసరించి పయనించే వారి “నిబద్ధతతో కూడిన ఆచరణాత్మకమైన అడుగులు పడటం” ముఖ్యంగా జరగాలి. గురుదేవుల మహిమ, ప్రేమ ఇప్పటికీ ఎప్పటికీ వ్యక్తమవుతూనే ఉంది. మన ఆచరణే, మన ప్రేమే వ్యక్తం కావాల్సి ఉంది. ఎంతో గొప్ప గొప్ప కార్యక్రమాలలో పాలు పంచుకోవడంతో పాటు మనకంటూ